

వండిన చికెన్ మాత్రమే తినాలి

చికెన్ తింటే.. 75 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకూ వండినది మాత్రమే తీసుకోవాలి. పచ్చిమాంసం తినకూడదు. హాఫ్ బాయిల్డ్ గుడ్లు తినకూడదు. కోడ్లు, మాంసం చేతితో తాకిన తర్వాత శుభ్రంగా కడుక్కోవాలి. గుడ్లు, చికెన్ వేర్వేరుగా ఉంచాలి. ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు. ముడి చికెన్, కోడిగుడ్లు తాకిన ఉపకరణాలను బాగా శుభ్రం చేయాలి. కోళ్లు మరణించి ఉంటే వాటిని జాగ్రత్తగా నిర్మూలన చేయాలి. రవాణా చేసే డబ్బాలు తరచూ శుభ్రం చేయాలి. తూర్పు గోదావరి జిల్లాలో ఎవరికైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లనొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి చెప్పాలి.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో, తూర్పుగోదావరి



కానూరులో డీఎంహెచ్‌వో పరిశీలన

కోడికి కష్టమొచ్చింది!

బర్డ్ ఫ్లూ వైరస్.. భయం..భయం



నిన్నటివరకూ కళకళ..నేడు వెలవెల

బర్డ్ ఫ్లూ సోకిన ఫారం వద్ద అధికారుల పరిశీలన

కోడికి కష్టమొచ్చింది.. వైరస్ దెబ్బకు ఓడిపోయింది.. కోడిని చూస్తేనే జనం పరుగుపెడుతున్నారు.. రెండు రోజుల కిందట వరకూ కోడిని చూసి లొట్టలేసిన వారు.. ప్రస్తుతం చికెన్ తినాలా! వద్దా!.. అనే మీమాంసలో పడిపోయారు.. ఎందుకంటే బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. తినకపోవడమే మంచిదనే అభిప్రాయంలో జనం ఉన్నారు.. దీంతో మంగళవారం చికెన్ దుకాణాలు వెల వెలబోయాయి.. పౌల్ట్రీ రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.. ఉభయగోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ యజమానులు లబోదిబో మంటున్నారు.. అయితే యానిమల్ హజ్బెండరీ అధికారులు మాత్రం ఉడకబెట్టిన తరువాత చికెన్ తిన్నా ఇబ్బందేంలేదని చెబుతున్నారు.. గతంలోనూ ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వచ్చింది.. అప్పుడు ఎవరికైనా సోకిందా అని ప్రశ్నిస్తున్నారు.. దీంతో పచ్చిమాంసం తింటే ప్రమాదం కానీ.. ఉడకబెట్టిన తరువాత తింటే ప్రమాదమేం లేదనేది చాలామంది వాదన..

- మూడు జిల్లాలపై తీవ్ర ప్రభావం
- పడిపోయిన అమ్మకాలు
- ఒక్కసారిగా దిగజారిన గుడ్డు ధర
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ రైతులు
- అప్రమత్తమైన అధికారులు
- ఎక్కడికక్కడ కట్టడికి చర్యలు
- కాకినాడలో ర్యాపిడ్ టీమ్‌లు
- పచ్చి మాంసం తింటేనే ప్రమాదం
- ఆఫ్ బాయిల్డ్ ఎగ్ తినకూడదు
- ఉడకబెడితే తినొచ్చంటున్న వైద్యులు

బడులు.. సెంట్రల్ జైలులో గుడ్డు నిలుపుదల

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ తీవ్రత వల్ల జిల్లాలోని అన్ని స్కూల్స్‌లో గుడ్లు పంపిణీ నిలిపివేశామని డీఈవో వాసుదేవరావు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. తమ డీజీ ఆదేశాల మేరకు సెంట్రల్ జైలులోని ఖైదీలకు చికెన్, గుడ్డుతో భోజనం ఆపేశామని కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ ఎంఆర్ రవికిరణ్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల వరకూ వాటి బదులుగా మెనూ ప్రకారం శాఖాహార భోజనం అందిస్తామన్నారు. బర్డ్ ఫ్లూపై తాము అప్రమత్తంగా ఉన్నామన్నారు. జైలులో ఖైదీలకు ఆదివారం ఒక్కో ఖైదీకి 175 గ్రాముల చికెన్.. మొత్తంగా ఆదివారం సుమారు 280 కిలోల చికెన్ వినియోగిస్తారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో అధికారుల ఆదేశాలు వచ్చే వరకూ నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

ఎస్సీ హాస్టళ్లలో మటన్ పెట్టండి!

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :బర్డ్ ఫ్లూ కేసులు నమోదు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్సీ హాస్టళ్లలో చికెన్, గుడ్లు సరఫరా నిలుపుదల చేయాల్సిందిగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్ల వార్డెన్లతో ఆమె సమావేశమై పరిస్థితులపై చర్చించారు. జిల్లాలోని ప్రి మెట్రిక్ హాస్టళ్లల్లో ప్రస్తుత మెనూ ప్రకారం అమల్లో ఉన్న వారానికి మూడు రోజులు చికెన్, ఆరు రోజులు కోడిగుడ్లు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో రెండు రోజులు చికెన్, ఆరు రోజులు కోడిగుడ్లు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వెల్లడించారు. చికెన్, గుడ్లకు బదులుగా ఉదయం అల్పాహారంలో పాలు, బూస్ట్, ఆదివారం మటన్ కర్రీ పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా హాస్టల్స్ వార్డెన్లకు సూచించారు.

తూర్పున అప్రమత్తం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కానూరు అగ్రహారంలో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేశారు. వాస్తవానికి జనవరి నుంచే ఇక్కడ కోళ్లు చనిపోతున్నట్టు చెబుతున్నారు. సుమారు 54 వేల కోళ్లు మృతిచెందిన తర్వాత పౌల్ట్రీ యజమాని జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు శాంపిల్స్ తీసి పరీక్షించడంతో బర్డ్‌ఫ్లూ బయటపడింది. ఇప్పటి వరకూ మొత్తం 84 వేల కోళ్లు ఇక్కడ మృతి చెందినట్టు ఓ అధికారి తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది మిగిలిన 2,976 కోళ్లకు మత్తు ఇచ్చి గోతుల్లో పూడ్చేశారు. గ్రామ ప్రజలు పెంచుకుంటున్న సుమారు 45 కోళ్లను కూడా స్వాధీనం చేసుకుని, వాటిని కూడా పూడ్చిపెట్టారు. ఈ గ్రామంలో 2700 మంది జనాభా ఉన్నారు. మూడు ప్రధాన కోళ్ల ఫారాలతోపాటు మరో ఆరు వరకూ ఫారాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం పూర్తిగా ఇక్కడ దృష్టి కేంద్రీకరించింది. వైద్యశాఖ అధికారులు ప్రతి మనిషి నుంచి శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. ఊరిలో ఎవరూ కోడి మాంసం, గుడ్లు తినవద్దని టాంటాం వేసినట్టు సర్పంచ్ దాసం వెంకన్న తెలిపారు. కిలో మీటరు లోపు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఇక్కడ అందరూ అప్రమత్తంగా ఉండేటట్టు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ కోళ్లఫారాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి వైరస్ లక్షణాలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు.



34 గ్రామాల్లో సర్వే : కలెక్టర్

నిడదవోలు నియోజకవర్గం పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల పరిధిలోని 34 గ్రామాల్లో ఇంటింటికీ సర్వే చేసి బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాల ఎవరికైనా ఉన్నాయేమో అనే సర్వే చేయడం కోసం 64 వైద్య బృందాలను నియమించాం. సీతానగరం మండలంలో కూడా సర్వే చేయిన్నాం. ఇతర యానిమల్స్‌కు వైరస్ సోకకుండా వాక్సినేషన్ చేయిస్తున్నాం. అపోహలు వద్దు, జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని, ఇంతవరకూ జిల్లాలో మనుషులెవరికి ఈ వ్యాధి సోకినట్టు దాఖలాలు లేవు. కానూరు నుంచి కోళ్లు, గుడ్లు బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ కానూరులో పర్యటించారు.

కోనసీమలో వైరస్ లేదు!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ ప్రచారంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా పరిధిలో ఎక్కడా బర్డ్ ఫ్లూ ప్రభావం లేనప్పటికీ ప్రచార ప్రభావంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దాంతో కోళ్ల ఆధారంగా నడిచే నాన్‌వెజ్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్ వినియోగం తగ్గుముఖం పట్టింది. చికెన్ దుకాణాలపై ఈ ప్రభావం పడి అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లావ్యాప్తంగా మండపేట, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల పరిధితోపాటు వివిధ ప్రాంతాల్లో 57 లక్షలకుపైగా కోళ్ల పెంపకం జరుగుతున్నట్టు పశు సంవర్ధకశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ ఇవ్వకపోవడం వల్లే కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కోనసీమ జిల్లాలో కోళ్లకు వ్యాక్సినేషన్ చేయడం వల్ల ఆ తరహా వ్యాధిలేమీ సోకలేదనేది అధికారుల వాదన. ఒక కోడికి వేసే వ్యాక్సిన్ ఖర్చు రూ.2 నుంచి రూ.10 అవుతుంది. దీంతో కొందరు వ్యాక్సినేషన్ వేయకపోవడంతో ఈ తరహా వైరస్ సోకుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌల్ట్రీ సంఘ యజమానులు మాత్రం కోనసీమ జిల్లాలో ఎక్కడా వైరస్ లక్షణాలు లేవని. చికెన్ వినియోగించవచ్చని ప్రచారం చేస్తున్నారు.

కోనసీమలో ఆనవాళ్లు లేవు : కలెక్టర్

కోనసీమ జిల్లాలోని 18 పౌల్ట్రీల్లో 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయి.. ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లను గుర్తించలేదు.. పక్క జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్న దృష్ట్యా పౌల్ట్రీ యజమానులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. వారం రోజులపాటు జిల్లాలో అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరా నిలిపివేయాలి. అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో బర్డ్ ఫ్లూపై సమీక్షించి పలు సూచనలు చేశారు.



2900 కోళ్లను పూడ్చేశారు!

పెరవలి మండలం కానూరు అగ్రహారంలో అధికారులు పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు.రెడ్ జోన్‌లో భాగంగా మంగళవారం మాస్కులు ధరించి బ్లీచింగ్ చల్లించారు. ఇదిలా ఉండగా కానూరులోని కోళ్లఫారాల్లో మిగిలిన 2900 కోళ్లను స్పెషల్ టీమ్స్ గోతులు తీసి పూడ్చివేయించారు.కోళ్ల ఫారం వద్ద ఉన్న 350 గుడ్లను కూడా గోతులు తీసి పాతిపెట్టారు.డీపీవో శాంతమ బి ఆధ్వర్యంలో గ్రామంలో రెడ్‌జోన్‌లో చేపట్టిన వివిధ శానిటేషన్ చర్యలు పర్యవేక్షించారు.పౌల్ట్రీ ఏరియాలో సోడియం క్లోరైడ్‌తో క్లీన్ చేసే పనులు నిర్వహించారు. గ్రామంలో 2700 హౌస్‌హోల్డ్స్ ఉండగా వాటన్నింటిని 3 బృందాలు సర్వే చేశాయి.



కానూరులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

కాకినాడలో అలెర్ట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాల్లో తనిఖీలు చేయాలని సిబ్బందిని ఆదేశించింది. ఈ మేరకు ప్రతి మండలానికి రెండు చొప్పున ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో ఆయా సచివాలయాల్లో పనిచేసే పశుసంవర్ధక శాఖ సిబ్బందిని భాగస్వామ్యం చేసింది. ఈ బృందాలు మంగళవారం నుంచి గ్రామాల్లో కోళ్లఫారాలను తనిఖీ చేయించింది. ఎక్కడైనా కోళ్లు మృత్యువాత పడినట్టు గుర్తిస్తే తక్షణం ఆ ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో మంగళవారం మొత్తం 42 బృందాలు కోళ్లఫారాలను పరిశీలించాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 82 కోళ్ల ఫారాల్లో 62 లక్షల లేయర్, బాయిలర్ కోళ్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ సంఖ్యలో కోళ్లు మృతి చెందినట్టు గుర్తిస్తే ఆయా ఫారాల యాజమాన్యాలు తక్షణం సమాచారం ఇవ్వాలని జిల్లా పశు సంవర్ధకశాఖ ఆదేశించింది. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతుండడంతో ఎక్కడికక్కడ ప్రజల్లో అవగాహన వచ్చేలా చైతన్యం చేయాలని అధికారులు ఆదేశించారు.

కాకినాడ జిల్లాలో అంగన్‌వాడీల గుడ్డుకు ఓకే



కాకినాడ జిల్లాలో స్త్రీశిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న గుడ్లను చిన్నారులకు తినిపించవచ్చా లేదా అనే దానిపై ఆ శాఖ అధికారులు మంగళవారం విషయాన్ని పశుసంవర్ధకశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉడికించిన గుడ్లను తినడం వల్ల ఎలాంటి వైరస్ ముప్పు ఉండదని స్పష్టం చేయడంతో ఈ జిల్లాలో అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా యధాతథం చేశారు. బర్డ్‌ఫ్లూ ఆందోళనల నేపథ్యంలో మంగళవారం గుడ్డు ధర పతనమైంది.

గుడ్డు.. బ్యాడ్

బర్డ్‌ఫ్లూ ప్రభావం కోళ్ల పెంపకందార్లను కొంత దెబ్బకొట్టింది. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రభావం నుంచి బయటపడతామని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు. గుడ్ల పరిశ్రమకు సంబంధించి ఒక్కొక్క గుడ్డు రైతు ధర సోమవారం రూ.4.25 వరకు ఉండగా మంగళవారం రూ.3.95కి తగ్గించి ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఒకేరోజు 30 పైసలు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కిలో రూ.200 నుంచి రూ.220 వరకు విక్రయాలు సాగిన బాయిలర్‌కు కోడిమాంసం ఒక్కసారిగా రూ.180కి పడిపోయింది. కొన్నిచోట్ల కొనేవారు లేక చికెన్ దుకాణాలు తెరవలేదు.

ఎండలొచ్చేశాయి.. వైరస్‌తో ఇబ్బంది ఉండదు..

ప్రస్తుతం కొద్దిచోట్ల మాత్రమే బర్డ్‌ఫ్లూ ఉంది. గోదావరి జిల్లాల్లో ఇతర ప్రాంతాలన్నీ బాగానే ఉన్నాయి. చలికాలంలో మాత్రమే వైరస్ ప్రబలి కోళ్లు చనిపోతాయి. ప్రస్తుతం ఎండలు కాస్తున్నాయి కాబట్టి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టమేమీ ఉండదు.

- పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ సెక్రటరీ

ఉడికించిన తరువాత తింటే ఏం కాదు..

బాగా ఉడికించిన తరువాత చికెన్, గుడ్లు తింటే వైరస్ ప్రభావం ఉండదు. ఈ రంగంపై అపోహలు తొలగేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలి. వైరస్ కారణంగా కొన్నిచోట్ల జరిగిన పొరపాట్లకు మొత్తం పరిశ్రమ నష్టపోయే పరిస్థితి సరికాదు. - మేకా శ్రీనివాస్, పౌల్ట్రీ యజమాని, మండపేట

ఖైదీలకు హెచ్‌ఐవీ పరీక్షలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోని ఖైదీలకు హెచ్‌ఐవీ సెంటినల్ సర్వే ప్లస్ (హెచ్ఎస్ఎస్ ప్లస్) ప్రారంభించామని జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన 400 మంది ఖైదీలకు రోజుకు 20 మందికి మించకుండా రక్త నమూనాలు సేకరిస్తున్నామని చెప్పారు. వాటిని పరీక్షల నిమిత్తం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలోని మైక్రోబయాలజీ విభాగానికి పంపిస్తున్నామన్నారు.ఆ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మార్చి నెలాఖరు వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు.పరీక్షలు వ్యాధుల నివారణకు ఉపకరిస్తాయనితూర్పు, ఏలూరు జిల్లాల క్లస్టర్ మేనేజర్ పి.బాలాజీ వెల్లడించారు.కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌రాజ్‌కుమార్,డాక్టర్ కోమల పాల్గొన్నారు.

కొవ్వూరులో వారానికోసారి రైతు సమస్యల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ స్థాయిలో వారానికి ఒకసారి రైతులకు సంబంధించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జేసి రెవెన్యూ సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా తూర్పుగోదావరి జిల్లాలో జాయింట్ కలెక్టర్ డివిజనల్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయానికి వచ్చి మండల తహశీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న అడంగల్ కరెక్షన్, రెవెన్యూ సమస్యలను పరిష్కరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పొరపాటున పడిన తప్పులను తక్షణం సరిచేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో కొవ్వూరు తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్,ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజానికి కృషి

- జిల్లా కేంద్రంలో డీఈఐసీ సెంటర్
- 24 వరకు ఇంటింటా సర్వే
- పీడీజే గంధం సునీత





డీఈఐసీ సెంటర్ పరిశీలించి చిన్నారిని ముద్దాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భావి భారత పౌరులు ప్రతి ఒక్కరూ ఎలాంటి లోపాలూ లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత వెల్లడించారు.ఈ మేరకు హైకోర్టు ఆదేశాలతో ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డీఈఐసీ)లను ప్రారంభించడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, డీఎం హెచ్‌వో, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, ఎంఎల్ఎస్ఏ కార్యదర్శులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకూ కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లాలోని డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా దివ్యాంగ పిల్లలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో రిఫర్ అవుతున్న కేసులు, వాటిపై తీసుకుంటున్న చర్యలను కూడా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఒకవేళ వివిధ కారణాల వల్ల దివ్యాంగులను ఇంటి వద్ద ఉంచి వారు పనులకు వెళ్తే అలాంటి పిల్లలను ప్రభుత్వ వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని పీడీజే వివరించారు. జిల్లా కేంద్రాల్లో ఉండే డీఈఐసీ సెంటర్లను ఎప్పటికప్పుడు సందర్శిస్తామని చెప్పారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలోని చిన్నారుల వైద్య సేవల విభాగాన్ని ఆమె పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. వైద్యాధికారులు,సిబ్బందితో సమీక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి (ఇన్చార్జి) ఎస్‌కే జానీబాషాశ్రీ, శిశు సంక్షేమాధికారి కె.విజయ కుమారి, డీఈఐసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ డి.హరిశ్చంద్ర ప్రసాద్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఇంద్రజ పాల్గొన్నారు.

ఈగిల్..రైట్ రైట్!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత మాదక ద్రవ్యాలను.. ముఖ్యంగా గంజాయిని నిర్మూలనపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన ఎలైట్ యాంటి-నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈఏజీఎల్ఈ -ఈగిల్) విభాగానికి చెందిన జిల్లా టీం, వాహనాన్ని మంగళవారం ఎస్పీ నరసింహ కిశోర్ పచ్చ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

- రాజమహేంద్రవరం



ఈగిల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



దివ్యాంగులతో సదరంగం!

సదరం రీ వెరిఫికేషన్ .. గందరగోళం

- దివ్యాంగులకు తప్పనిపాట్లు
- ఓపీ రోగులకు తీరని అవస్థలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రిలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ గందరగోళంగా సాగుతోంది. మూడు రోజుల విరామం తర్వాత మంగళవారం ఈ ప్రక్రియను అధికారులు మళ్లీ ప్రారంభించారు. ఆసుపత్రి ప్రధాన బ్లాకులోని పై అంతస్తులో ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, సైకియాట్రిక్ విభాగాలకు సంబంధించి రీ వెరిఫికేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. అయితే ఎవరు ఓపీ చూపించుకోవడానికి వచ్చారో, ఎవరు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చారో తెలియని అయోమయ పరిస్థితులు అక్కడ నెలకొంటున్నాయి. ఆయా విభాగాల్లోని సిబ్బంది సైతం సరైన సమాధానం చెప్పకపోవడంతో వైద్య సేవల కోసం వస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. రీ వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు, వారి సహాయకులు కూర్చోడానికి కూడా సరైన ఏర్పాట్లు లేవు. కేవలం కొద్ది మందికి మాత్రమే సరిపడే బల్లలు అక్కడ ఉన్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డాక్టర్ పిలిచే వరకూ గంటల తరబడి నిలబడి ఎదురు చూడాల్సి వస్తోంది. పరిస్థితులు ఇంత గందరగోళంగా మారినా సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌కు సంబంధించి అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఓపీ చూపించుకోవడానికి వచ్చే వారితో పాటు రీ వెరిఫికేషన్ కోసం వస్తున్న వారికి ఇబ్బందులు తప్పడంలేదు. మరోపక్క ఓపీ నమోదు విభాగంలోనూ ఇలాంటి గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోలాహలంగా.. భీమేశ్వరుని రథోత్సవం





- ద్రాక్షారామ వీధుల్లో వైభవంగా రథోత్సవ వేడుక
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం మంగళవారం కోలాహలంగా జరిగింది. మధ్యాహ్నం కల్యాణ మూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను పుష్పాలంకృత రథంపై అర్చకస్వాములు అధిష్ఠింపజేశారు. ధూప సేవ అనంతరం 2.55 గంటలకు ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు.

ఉత్సాహంగా..

స్వామివారి రథం ఆలయం వద్ద నుంచి చంద్ర వీధి గుండా వెలంపాలెం చేరుకుని సూర్యవీధి మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. తదుపరి మార్కెట్, యానాం సెంటర్ నుంచి వేగాయమ్మపేట చేరుకుంది. హరహరమహాదేవ శంభోశంకర అంటూ వందలాది మంది భక్తులు ఉత్సాహంగా రథయాత్రలో పాల్గొన్నారు. రథంలో ఆశీనులైన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆస్థాన పూజ

రథం వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం వద్దకు చేరుకుంది. సాయంత్రం 6.30 గంటలకు కల్యాణమూర్తులకు ఆస్థాన పూజ జరిగింది. నీరాజన మంత్రపుష్పంతో ముగిసింది. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, ఈవో అల్లువెంకట దుర్గాభవానీ, ఆలయ సిబ్బంది, ఆస్థాన పండితుడు దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకులు, వేదస్వస్తి వాచకులు, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు పర్యవేక్షణలో ఏఈ మేడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ కండక్టర్లు, వైర్లు తొలగించారు. రథోత్సవం అనంతరం పునరుద్ధరించారు.





రాజాధిరాజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి రామరాజు, వెంకటసత్య నారాయణరాజుల నిర్మితమైన రాజాధిరాజా వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ, 7 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే నిర్మితమైన అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోవిందనామ, నృసింహ నామ స్మరణల నడుమ గ్రామోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, డీఎస్పీ ఎస్.మురళీమోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీస్వామివారికి చక్రస్నానం జరగనుంది. గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయం వద్ద నుంచి ఉదయం 8 గంటలకు సముద్రం వద్దకు బయలుదేరి ప్రత్యేక పూజలు అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. ప్రత్యేక బృందాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద క్యూలైన్లు, సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. సముద్రం వద్ద సుమారు వంద మీటర్ల మేర ప్రత్యేక కర్రలతో బారికేడ్లు స్నానమాచరించే ప్రదేశం వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో అఖిల, ఏసీ సత్యనారాయణతో కలిసి చక్రస్నానం, వసంత మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, డీటీ భాస్కర్, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్‌ఐ దుర్గాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోర సంవాదం



చోర సంవాదం ఘట్టం నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.30 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారిని 16 మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు నిర్వహించారు. దారి దోపిడీ దొంగకు, భగవంతునికి మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు. దారి దోపిడీ దొంగగా మారిన పరాకాలుడు అనే మహారాజు మారు వేషంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహుడిని కూడా దోచుకుంటాడు. మహా విష్ణువు ఆయనను మంచివాడిగా చేసి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన పరకాలుడు పేరును తిరుమంగల్వార్‌గా మార్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. ఈ సంభాషణను సున్నాలు, పన్నాలు పేరుతో వైష్ణవోపేతంగా ఆలయ స్థానాచార్యులు, వేద పండితులు, అర్చకులు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకట శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వెంకట శాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ , ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబసభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

18న ఉమ్మడి జిల్లా స్థాయి సంఘాల సమావేశాలు

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయి సంఘాల సమావేశాలు జరుగనున్నాయని జడ్పీ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోపు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఓ ప్రకటనలో కోరారు.

భక్తులకు సులభతరంగా దర్శనాలు

పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి మహాశివరాత్రి పర్వదినాల్లో తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు సులభతరంగా దర్శనం, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడం పూర్తయ్యే విధంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, పుష్కరిణి, భక్తులు రాకపోకలు సాగించే ముఖద్వారం, బైపాస్‌రోడ్డు వైపు మార్గాలను పరిశీలించారు. క్యూలైన్లు ఎక్కడ నుంచి ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశీలన చేశారు. వాహనాలను పార్కింగ్ చేసే నిమిత్తం 6 ప్రాంతాలను ప్రాథమికంగా గుర్తించారు. నేరుగా దర్శనాలకు వెళ్లే భక్తులు, స్నానాలు మాత్రమే ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు మణికుమార్, జానీభాషా తదితరులున్నారు.



పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న కమిషనరు, ఈవో, సీఐ తదితరులు

బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత ఉమ్మడి జిల్లా జట్లు

రెండవ స్థానంలో కృష్ణా జిల్లా జట్లు



బాలురు, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల సభ్యులు

పిఠాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. 4రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా మంగళవారం రాత్రి పది గంటల వరకూ జరిగిన ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. బాలబాలికల విభాగాల ఫైనల్స్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు తలపడ్డాయి. రెండు విభాగాల్లోనూ ఉమ్మడి తూర్పు బాలబాలికల జట్లు విజేతలుగా నిలవగా, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు రెండవ స్థానంలో నిలిచాయి. విజేతలకు పిఠాపురం నియోజకవర్గ జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, జాతీయ ఉమెన్స్ టీం కోచ్ శ్రీనివాసరావు షీల్డులు, బహుమతులు అందజేశారు.

నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలు

డాక్టర్ ఉమర్‌ఆలీషా

ముగిసిన పీఠం వార్షిక మహాసభలు

కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు అందజేత



పిఠాపురంలో కుట్టుమిషన్లు అందజేస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సామాన్యుల నుంచి తత్వవేత్తలు, సమాజంలో ఎంత ప్రముఖులైనా కాలపరీక్షలకు అతీతులు కారని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. ఆధ్యాత్మిక తాత్వికజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారానే ఈ పరీక్షలను తట్టుకోగలమని చెప్పారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగిన పీఠం వార్షిక జ్ఞాన చైతన్య మహాసభలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ముగింపు సభలో భక్తులనుద్దేశించి ఆయన అనుగ్రహభాషణ చేస్తూ నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలు పొందగలమన్నారు. మానసిక తృప్తి మానవుడిని సంస్కారవంతుడిని చేస్తుందని తెలిపారు. మంచి చెడులను విశ్లేషించే శక్తి ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా లభిస్తుందని చెప్పారు. ప్రతి చిన్న విషయాన్ని అసహనానికి గురవుతూ మానవుడు అనేక సమస్యలను కొని తెచ్చుకుంటున్నాడని తెలిపారు. ధ్యాన, జ్ఞాన మంత్రసాధనలతో కూడిన త్రయీ సాధన ద్వారా సహనశక్తిని అలవర్చుకుని దీనిని అధిగమించివచ్చని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని సూచించారు. విశ్వమానవ శ్రేయస్సుకు పాటుపడుతూ పీఠం ద్వారా అందిస్తున్న సేవలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రశంసించారు.

ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు, ఎన్‌ఆర్‌ఐ సభ్యులు పేరూరి విజయరామ సుబ్బారావు, సన దంపతులు భవిత దివ్యాంగుల శిక్షణా కేంద్రం కొరకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రోస్టిమ్యులేటర్లను పీఠాధిపతి డాక్టర్, ఉమర్‌ఆలీషా, ఇతర ప్రముఖులు అందజేశారు. పీఠం రూపొందించిన కరదీపకలు, గ్రంథాలను ఆవిష్కరించారు. పీఠం నిర్వహిస్తున్న తాత్విక బాలవికాస్ ద్వారా ఆధ్యాత్మిక శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన చిన్నారుల ప్రసంగాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ నందిని పాండా, గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, అహ్మద్ ఆలీషా, హుస్సేన్‌షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, సెంట్రల్ కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, ఏవీవీ సత్యనారాయణ, ప్రసాద వర్మ, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆరికిరేవులలో సినిమా షూటింగ్

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో రామ్ పోతినేని 22వ సినిమా షూటింగ్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. మైత్రీ మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇంకా పేరు పెట్టలేదు. మంగళవారం ఆరికిరేవుల స్నానఘట్టం, గోదావరి నది వద్ద సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాకు మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్‌లు నటిస్తున్నారు. వివేక్ మార్విన్‌లు మ్యూజిక్ అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం బ్యాక్‌డ్రాప్‌గా సాగే చిత్రం కావడంతో మరో నెల రోజులపాటు కొవ్వూరు పరిసర ప్రాంతాలో చిత్ర నిర్మాణం జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు.



కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరుగుతున్న షూటింగ్

సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించాలి

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడలో హాకీ టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడ హాకీ పట్ల జిల్లా యువతలో ఆసక్తి, అనురక్తి పెంపొందేరీతిలో కాకినాడ డీఎస్‌ఏ స్టేడియంలో జాతీయ సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక క్రీడా ప్రాధికార సంస్థ మైదానాన్ని సందర్శించి 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడ అయిన హాకీ పట్ల దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాచుర్యం, ప్రోత్సాహం కల్పించేందుకు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేసి, జాతీయ స్థాయి హాకీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ టోర్నమెంట్ ఈనెల 15 నుంచి 28వరకు 2వారాలపాటు డీఎస్‌ఏ మైదానంలో జరుగుతుందన్నారు. పోటీల్లో పా ల్గొనేందుకు విచ్చేసే క్రీడాకారులకు తగు సదుపాయాలతో బస, రవాణా, వారి అలవాట్ల కనుగుణమైన ఆహారం ఏర్పాటు చేయాలన్నా రు. పోటీలను తిలకించేందుకు వచ్చే ప్రజల కోసం స్టేడియం చేరువలో పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. స్టేడియంలో తాగునీరు, మరుగుదొడ్లు సదుపాయాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్, డీఎస్డీఏవో శ్రీనివాస్‌కుమార్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తదితరలున్నారు.

డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల

మోతుగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు మంగళవారం 3వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. గోదావరి డెల్టా రబీ పంటలకు సీలేరు కాంప్లెక్స్ నుంచి 10టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారులను కోరడంతో తమ అధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి జలాశయం నుంచి 3వేల క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చెయ్యకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదలు చేస్తున్నామన్నారు. 10 టీఎంసీల నీటిని 3వేల క్యూసెక్కుల చొప్పున 40రోజులు పాటు నీటి విడుదల కొనసాగించాలని ఇరిగేషన్ అధికారులు కోరినట్టు ఈఈ బాలకృష్ణ తెలిపారు. అలాగే కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 4వేల క్యూసెక్కుల నీరు కూడా గోదావరి డెల్టాకు చేరుతుందని తెలిపారు. డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న సందర్భంగా జలాశయం దిగువున ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... నదీ ప్రవాహాన్ని దాటుట, దాని పరిసరాలకు వెళ్లరాదని, ప్రజలు, పెంపుడు జంతువులు ఏమైనా ఉన్నా డొంకరాయి జలాశయం దిగువకు రాకుండా చర్యల చేపట్టి అప్రమత్తంగా ఉండాలని అధికారులు డొంకరాయి జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.



డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఇరానీ గ్యాంగ్ అరెస్టు

- రాజమహేంద్రవరం పరిసరాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు
- వలవేసి పట్టేసిన తూర్పు పోలీసులు
- 380 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిసరాల్లో దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు ముఠా సభ్యులైన ఇరానీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన రాజమహేంద్రవరంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఇటీవలజరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించి నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు, నగరం చుట్టూ పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. కొంత సమాచారం ఆధారంగా ఒడిశాలోని మారుమూల ప్రాంతంలోని ఇరానీగ్యాంగ్ ఈ దురాగతాలకు పాల్పడుతున్నట్టు నిర్ధారించుకున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడానికి ఒక ప్రత్యేక బృందాన్ని పంపించారు. ఈలోపు గామన్ బ్రిడ్జిపై వాహన తనిఖీలు చేస్తుండగా కొందరు పట్టుబడ్డారు. వారిని ప్రశ్నించగా నేరం అంగీకరించారని ఎస్పీ తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న ఒడిశాలోని నౌపడ జిల్లా కరియర్ రోడ్‌కి చెందిన జహీర్ హుస్సేన్ అబూ తాలిబ్, మహ్మద్ షబ్బార్, ఖాసీం అలీ, కిస్మత్ అలీ, దిల్‌రుబా బేగం సోహైల్, అబ్బాస్ అలీ అనే ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. అదే ప్రాంతానికి చెందిన హైదర్ అలీ, జావెద్ అలీ అనే ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. చాలాఏళ్ల కిందట ఇరాన్‌నుంచి వచ్చి తిక్రీ అనే ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నందున వాళ్లను ఇరానీ గ్యాంగ్‌గా పిలుస్తున్నారని చెప్పారు. వాళ్లపై ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయన్నారు. అక్కడ వీళ్లను మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌గా పోలీసులు ప్రకటించారన్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి 382 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు, రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, కొవ్వూరు రూరల్ సీఐ విజయ్ బాబు, రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలశౌరి, సీఐ రాంబాబు, రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్ఐ ఎండీ జుబేర్, స్పెషల్ టీం, టెక్నికల్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు.



కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు, కొవ్వూరు రూరల్ సీఐ విజయ్‌బాబు, రాజానగరం సీఐ వీరయ్యగౌడ్, రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ అప్పారావులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

యువశక్తిని మేల్కొల్పేందుకు..

దేశవ్యాప్త స్కేటింగ్ యాత్ర



- కాశీ నుంచి 20 రాష్ట్రాల మీదుగా 10,550 కి.మీ. యాత్ర
- గిన్నీస్ రికార్డ్ లక్ష్యంగా యువతి ప్రయత్నం
- కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఘన స్వాగతం

కత్తిపూడిలో యాత్రకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, సంఘ సభ్యులు

శంఖవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ యువశక్తిని మేల్కొల్పేందుకు, మహిళాసత్తాను చాటేందుకు కాశీనుంచి కాశీకి దేశవ్యాప్తంగా స్కేటింగ్ యాత్ర చేస్తున్న సోనీ చౌసియా అనే యువతికి కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఘనస్వాగతం లభించింది. స్కేటింగ్ చేస్తూ వచ్చిన ఆమెకు మంగళవారం కాకినాడ జిల్లా స్కేటింగ్ సంఘ సభ్యులు, కత్తిపూడి గ్రామస్తులు ఆహ్వానం పలికారు. 20 రాష్ట్రాల మీదుగా 10,550కిలోమీటర్లు సాగే ఈ యాత్ర కత్తిపూడికి చేరుకుంది. ఈ సందర్భంగా సోనీ చౌసియా మాట్లాడుతూ మే 12కి కాశీకి చేరుకునేలా ప్రణాళికలు చేసుకున్నామని, గిన్నీస్ బుక్‌లో రికార్డ్ లక్ష్యంగా ఈ యాత్రను చేస్తున్నానని తెలిపారు. తనకు అపూర్వ స్వాగతం తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ మురమళ్ల శివయ్య, ప్రత్తిపాడు కండ కార్యవాహ మొండి వీరవెంకటరమణ, జిల్లా ప్రచారప్రముఖ్ సత్యలింగేశ్వరావు పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళాలు



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత హరికృష్ణ దీప్తి



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత దీప

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఇద్దరు దాతలనుంచి రూ.2లక్షలు విరాళాలుగా సమకూరాయి. విజయవాడకు చెందిన హరికృష్ణ దీప్తి, సుశ్రిత్‌కృష్ణ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా చెన్నయికి చెందిన వెంకటరావు, దీప దంపతులు పీఆర్వో కృష్ణారావుకు అందించారు. దాతలను వారు అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. అన్నదాన విభాగ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులున్నారు.

న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన



ప్రియుడి ఇంటి ముందు నిరసన తెలియచేస్తున్న యువతి బంధువులు

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడిలో ఘటన

మామిడికుదురు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించిన వ్యక్తి పెళ్లికి ముఖం చాటేశాడని పేర్కొంటూ ఓ యువతి తన ప్రియుడి ఇంటిముందు ఆందోళన చేపట్టింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలోని పాశర్లపూడిలో మంగళవారంజరిగిన ఈఘటన చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన కాట్రేనికోన చెయ్యేరు పండువారిపేటకు చెందిన బాధిత యువతి తెలిపిన వివరాలివి. పాశర్లపూడి బాడవ చింతలమెరక ప్రాంతానికి మోకా ప్రవర్, తాను కాకినాడలో చదువుకుంటూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని తెలిపింది. తమ ప్రేమ విషయం ఇంట్లో అందరికీ తెలుసునని, ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. తమ ప్రేమ విషయమై రెండు, మూడుసార్లు పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయని, రెండు నెలలుగా ప్రవర్ తనను దూరం పెట్టి అందుబాటులో లేకపోవడంతో 15 రోజుల క్రితం కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితురాలు పేర్కొంది. ప్రవర్ తండ్రి పెద్దల సమక్షంలో పెళ్లికి అంగీకరించినప్పటికీ తర్వాత అతడిని కుటుంబసభ్యులు కట్టడి చేయడంతో తనను దూరం పెట్టాడని, తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ప్రవర్ ఇంటి ఎదుట బంధువులు, సన్నిహితులతో కలిసి ఆందోళన చేపట్టింది. అతడితో తనకు పెళ్లి చేయకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు హెచ్చరించింది. విషయం తెలుసుకున్న నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో చర్చించి ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెళ్లి విషయంపై పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ఒకదశలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని, నిరసన విరమించుకోవాలని కోరడంతో యువతి బంధువులు ఆందోళన కార్యక్రమాన్ని విరమించి వెనుదిరిగారు.

సాంకేతికత సాయంతో కాపాడారు

- ఆత్మహత్య చేసుకుంటున్నట్టు కోనసీమకు చెందిన వ్యక్తి సెల్ఫీ వీడియో
- అన్నవరంలోని ఓ లాడ్జీలో ఉన్నట్టు సాంకేతికత ద్వారా కనుగొన్న పోలీసులు
- సురక్షితంగా బంధువులకు అప్పగింత

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఒక నిండుప్రాణాన్ని కాపాడింది. దీనికి పోలీసుల కృషి తోడైంది. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో స్నేహితులకు పంపాడు. ఈ సమాచారాన్ని అతడి కుటుంబసభ్యులు పి.గన్నవరం సీఐకు తెలపడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా అతడు అన్నవరంలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడినుంచి అన్నవరం ఎస్ఐకి సమాచారమివ్వగా ఆయన లాడ్జిల యూనియన్ వాట్సాప్ గ్రూప్‌లో సెల్ఫీ వీడియో ఫార్వర్డ్ చేశారు. ఏ లాడ్జి నుంచి వీడియో తీసుకున్నాడనేది తెలియపరచాలని అప్రమత్తం చేయడంతో నిమిషాల వ్యవధిలో ఒక లాడ్జి యజమాని స్పందించి తన పక్కనున్న లాడ్జిలో తీసిన వీడియో అని బదులిచ్చాడు. వెంటనే అక్కడికి వెళ్లి తలుపుతట్టి సంబంధిత వ్యక్తిని బయటకి రప్పించాడు. వెంటనే అన్నవరం ఎస్ఐ హరిబాబు సిబ్బందితో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్టేషన్‌కి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు అన్నవరం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించిన ప్రైవేటు లాడ్జి యజమానిని ఎస్ఐ హరిబాబు అభినందించారు. కాగా, ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన పోలీసు యంత్రాంగాన్ని కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

అన్నవరంలో వాట్సాప్ ద్వారా వ్రతాలు, దర్శన సేవలు

అన్నవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవల్లో అన్నవరం ఆలయానికి సంబంధించి సేవలను అందుబాటులో ఉంచినట్లు ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు 9552300009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని టైప్ చేస్తే సేవలకు రుసుం డిజిటల్ చెల్లింపు ద్వారా తీసుకుని వ్రతం టిక్కెట్లు, దర్శనం టిక్కెట్లు, విరాళాలు చెల్లింపు చేసుకోవచ్చునన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని తమ ఇంటి నుంచే బుక్‌చేసుకుని అన్నవరం ఆలయానికి విచ్చేసి బుకింగ్ రశీదు ప్రింట్ తీసుకుని కార్యాలయంలో అందజేస్తే ఎంచుకున్న సేవలను అందిస్తామన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

రావులపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి గోదావరిలో వంతెన సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని రావులపాలెం ఎస్ఐ చంటి తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించగా మృతురాలు 5.4 అంగులాల పొడవు, 6 అంగులాల జట్టు, నీలి రంగు చీర, జాకెట్టు కలిగి ఉందన్నారు. చర్మం పూర్తిగా కమిలిపోయి గుర్తుపట్టకుండా మారిపోయిందని, ప్రమాదవశాత్తూ నదీలో జారిపడి ఇక్కడకు ప్రవాహానికి కొట్టుకొచ్చి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని బంధువుల గుర్తింపుకోసం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

మహిళ వేషంలో బంగారం చోరీ

- వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్త్రీ వేషం ధరించి ఒక పురుషుడివద్ద రూ.లక్ష విలువచేసే బంగారు గొలుసు అపహరించాడు. దీనిపై గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడివద్ద సొత్తు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ఎవరైనా ట్రాన్స్‌జండర్లుగా జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల జాతీయ రహదారిపై, షాపుల వద్ద ఎదుటివారిని అవమానపరిచేలా మాట్లాడినా, భౌతికదాడికి పాల్పడినా, అశ్లీల నృత్య ప్రదర్శనలు చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- ప్రేమించిన బాలిక కుటుంబీకులు తల్లిదండ్రులను అవమానించారని ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన బాలిక కుటుంబీకులు తల్లిదండ్రులను అవమానించారని మనస్తాపం చెందిన ఓ యువకుడు చీరతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన చిట్ర సూర్య రాజమహేంద్రవరంలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నాడు. వాడపల్లికి చెందిన బాలికతో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం ఉంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి, అమ్మమ్మ, మేనమామ, తాతయ్య అతడిని దీనిపై ప్రశ్నించారు. సూర్య ఇంట్లో కూడా విషయం చెప్పడంతో తండ్రి చిట్ర శివ, అతని భార్య బాలిక ఇంటికి వెళ్లారు. దీంతో బాలిక తరుపు వారు, రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది అందరూ కలిసి వీరిని దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించారు. తనవల్ల తల్లిదండ్రులు అవమాన పడ్డారని మనస్తాపం చెందిన సూర్య సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా హాలులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బాలిక కుటుంబసభ్యులు ఐదుగురిపై పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం, మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరించడం, కొట్టడం, మూకుమ్మడి దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ముందుజాగ్రత్తగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

పిఠాపురంలో 160 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యంతో సీఐ, ఎస్ఐలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో మంగళవారం రెండు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించి 160 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాల్లో రేషన్‌బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ దాడులు నిర్వహించారు. బి.ప్రత్తిపాడులో రైసుమిల్లు ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో లారీ, వేన్‌ల ద్వారా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ, వేన్‌లో ఉన్న 144 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఊటా రాజు, శివశంకర్, వెలుగుల చినబాబ్జిలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్‌కేపాలెంలో కీర్తి సూరిబాబు ఒక నివాసంలో నిల్వ ఉంచిన 16 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

దుర్గాడలో 25.50క్వింటాళ్లు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. వేన్‌లో తరలిస్తున్న 25.50క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేన్‌ను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన కర్రి కృష్ణపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తగా పది ఓపెన్ ఇసుక ర్యాంపులు

- నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్
- మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలాఖరు నాటికి తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా 10 ఓపెన్ ర్యాంపులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవులలో ఇసుకర్యాంపు ఏర్పాటుపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లారీలకు తప్పనిసరిగా టార్పాలిన్ కట్టాలని, రోడ్లపై ఇసుక జారి పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఆరికిరేవుల, చిడిపి, పక్కిలంక, తాడిపూడి, పురుషోత్తపల్లి, మునికూడలి, పెండ్యాల, కాటవరం, శింగవరం గ్రామాల్లో ఓపెన్ ర్యాంపులకు ఫిబ్రవరి నెలాఖరు లే దా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. జిల్లాలో ప్రసుత్తం 9 డీసిల్టేషన్ ర్యాంపులు నడుస్తున్నాయని, రేపటిలో గా మిగిలిన 8 డీసిల్టేషన్ ర్యాంపులకు అ నుమతులు ఇస్తామన్నారు. ఓపెన్ ర్యాంపు లు 12నడుస్తున్నాయన్నారు. వేమగిరి, జీడి గుంట ర్యాంపులను రద్దు చేశామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో మంగళవారం రైలుపట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలుఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రాజమహేంద్రవరం రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం.. మృతి చెందిన వ్యక్తికి 40 ఏళ్ల ఉంటాయని, నీలం రంగు షర్ట్, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తుపట్టలేనివిధంగా ఉందని రైల్వే ఎస్ఐ పి.లోవరాజు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో మాజీ ఉపరాష్ట్రపతి కుటుంబీకుల పూజలు

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిదిలో మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఈడబ్ల్యుఎస్ కోటాలో ఆలిండియా టాపర్‌గా నిలిచారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇప్పటివరకు అందిన ఫలితాల్లో నలుగురు విద్యార్థులు కోటిపల్లి యశ్వంత్‌సాత్విక్, కోడూరి యశ్వంత్ రాజా, పి.షరత్ సంతోష్, దువ్వ ఆశిష్ సాయి శ్రీకర్ 99.99 పర్సంటైల్ సాధించారని, నవులూరి ఆశ్రిత్ సాయి, కంచుమర్తి ఫణీత్ , ఎన్.ఉదయ్ పవన్ 99.98 పర్సంటైల్ సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్లు, ప్రిన్సిపాల్‌తో కలిసి తిరుమలరావు అభినందించారు.

మోసగించిన కేసులో రెండేళ్ల జైలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి సొమ్ములు తీసుకుని మోసగించిన కేసులో నేరారోపణ రుజువు కావడంతో రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ ముమ్మిడివరం జుడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ రహ్మతుల్లా మంగళవారం తీర్పు చెప్పారు. ఉప్పలగుప్తంమండలం భీమనపల్లికి చెందిన జంపనగణేష్‌రాజు 2017లో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురినుంచి డబ్బు తీసుకుని మోసగించగా ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఫైవిధంగా తీర్పు వచ్చిందని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

ప్రత్తిపాడులో ఘనంగా మేరీమాత యాత్ర మహోత్సవాలు



ప్రత్తిపాడులో మేరీమాతను ఊరేగిస్తున్న భక్తులు



మరేగిరి కొండపై ప్రార్థనలు చేస్తున్న భక్తులు

- ఉమ్మడి తూర్పు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన క్రైస్తవ భక్తజనం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మేరీమాత యాత్ర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. నాలుగు రోజులుగా మేరీమాత ఉత్సవాలు కొనసాగుతూ ఉన్న ముగింపురోజు మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి మరేగిరికి భక్తజనం పోటెత్తడంతో ఆ పరిసరాలు జనసందోహంతో కిటకిటలాడాయి. మరేగిరిపై కొలువైఉన్న మేరీమాతను, లూర్దుమాతను, యాకుల మాత, ఏసుప్రభువు విగ్రహాలను భక్తులు సందర్శించారు. అనంతరం కొండపై నిర్వహించిన క్రైస్తవప్రార్థనలో వేలాదిమంది పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రజక జూబ్లియేరియన్స్, సాలురు, రాజమహేంద్రవరం, అరకు, విజయనగరాలకు చెందిన గురులు పి.జోసెఫ్, ఈ.రవీంద్రకుమార్, ఎం.జేసుదాసు, ఎం.లూర్దులు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి మానవాళి, జీవన ఉన్నతికి, ఐక్యతకు క్రీస్తు సందేశాలు దోహదపడతాయన్నారు. భక్తులకు నిర్వాహకులు, స్థానిక సేవా సంస్థల కార్యకర్తలు అన్నదానం చేసి మజ్జిగ, మంచినీరు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

చోరీ కేసులో బంగారు ఆభరణాల రికవరీ

రాజానగరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల అపహరణ కేసులో నిందితుడిని అరెస్టు చేసి ఆభరణాలను రాజానగరం పోలీసులు రికవరీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలో జరిగిన ఈచోరీకి సంబంధించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవెలుగుబంద గ్రామానికి చెందిన ప్రగడకృష్ణ గతేడాది ఏప్రిల్ 1న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. మర్నాడు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం, బీరువా తాళాలు బద్దలు కొట్టి బీరువాలో భద్రపర్చిన 249.5 గ్రాముల పలు రకాలైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లుగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన చిలపనశెట్టి సన్యాసిరావు అలియాస్ చిన్న అనే వ్యక్తిని నిందితుడిగా నిర్ధారించి అరెస్టు చేశామని, అతని నుంచి చోరీకి గురైన 156.625 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఇంకా మిగిలిన 66 గ్రాముల బంగారు ఆభరణాలు ముథూట్ గోల్డ్ పాయింట్ షాపునుంచి రికవరీ చేయాల్సి ఉందన్నారు.సంఘటనా స్థలం సమీపంలో నమోదైన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితుడిపై పలు పోలీస్టేషన్లలో 27కుపైగా కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుడిని పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలను రికవరీ చేసిన సీఐతో ఎస్ఐ మనోహర్, హెచ్‌సీ అమ్మిరాజు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

రుణాల మంజూరులో బ్యాంకర్లు కీలకం



జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అల్పాదాయ వర్గాలకు, రైతులకు మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు రుణాల మంజూరు, యూనిట్స్ గ్రౌండింగ్ ప్రక్రియలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం సాయంత్రం బ్యాంక్ రీజనల్ హెడ్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్సీ కార్డ్స్, కౌలురైతులకు రుణాలు, క్రాప్ ఇన్సూరెన్స్, పశుసంవర్ధక శాఖకు చెందిన పీకేసీసీ లోన్లు, పీఎం విశ్వకర్మ, సూర్య ఘర్, మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకర్లు వారి బ్యాంకు తరుపున ఒక నోడల్ అధికారిని నియమించి ఆ సమాచారాన్ని అందించాలని కోరారు. వివిధ శాఖలకు సంబంధించి యూనిట్స్ గ్రౌండింగ్, రుణాల మంజూరు విషయంలో సమన్వయం కొరవడడం వల్ల అనుకున్న స్థాయిలో ప్రగతి సాధించలేకపోతున్నాయన్నారు. విశ్వకర్మ యోజన కింద 2733 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, వారిలో 661 మందికి రుణాలు మంజూరు చేసి 508 యూనిట్స్‌కు రుణాలు అందించామన్నారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు విషయంలో ఎస్ఎల్‌బీసీ నిబంధనలు పాటించడంపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రుణాలు మంజూరు విషయంలో ఎస్ఎల్‌బీసీ నిర్ధారించిన 11,106 మందికి గాను 10,217 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశామన్నారు. పీఎం ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్, జిల్లా పరిశ్రమల కేంద్రానికి చెందిన 599 యూనిట్లకు గాను 313 యూనిట్లు రూ13.04 కోట్లతో ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజరు డీవీ ప్రసాద్, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కడప ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి



కడియం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి

కడియం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని కడప ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. కడియంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ కార్యాలయం వద్ద క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డితోపాటు టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్‌కిరణ్, పరిశీలకులు ఎం.తేజోవతి, డొక్కా నాథ్‌బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ మండలాధ్యక్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, బొర్సు సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ప్రతి గ్రామంలో పట్టభద్రులను గుర్తించి వారితో పోలింగ్ రోజు ఓటువేయించే బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. నియోజకవర్గంలో 8,365 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గట్టి సుబ్బారావు, చెల్లుబోయిన శ్రీనివాస్, పాటంశెట్టి రాంజీ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, పంతం గణపతి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 22, 23 డివిజన్లలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, పరిశీలకుడు బీవీ కృష్ణప్రసాద్, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రచారం చేశారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. నగరంలో 17,280 ఓట్లున్నాయన్నారు

ఘంటసాలకు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద జిత్ మోహన్ మిత్ర కళావేదికలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్థంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళారత్న పీవీఎస్ కృష్ణారావు, వి.జగపతిరావు, జి.నరసింహమూర్తి, ముద్రగడ ఏసుబాబు, బి.సీతారామారావు పాల్గొన్నారు. ధవళేశ్వరంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయ ఆవరణ సమీపంలోని ఘంటసాల విగ్రహానికి గోదావరి కల్చరల్ అసోసియేషన్, రాకా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు జీవీ రమణ మాట్లాడుతూ ఘంటసాల స్వాతంత్ర్య సమర యోధుడుగా పద్నాలుగు నెలలు జైలు జీవితం కూడా గడిపారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ మహమ్మద్ షా ఆలీ, వీకే రామారావు, భమిడిపాటి రాధాకృష్ణమూర్తి, పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

కడియం: ఎన్టీఆర్, ఘంటసాల అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో వేమగిరిలో ఘంటసాల వర్థంతి నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మహీంద్రా నుంచి ఈవీ కారు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఅండ్ఎన్ మోటార్స్ సంస్థ గ్లోబలైజేషన్ డిజైన్‌తో, అత్యాధునిక ఫీచర్లతో కూడిన కొత్త ఈవీ మోడల్‌కారును మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి కారును ప్రారంభించారు. అత్యాధునికమైన ఆటోపార్కింగ్, అడాస్ 2 ప్లస్‌ప్లస్, 360 డిగ్రీల సెక్యూరిటీ పార్కింగ్, విజన్ ఎక్స్ తదితర ఫీచర్లతో ఈ కారును అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ అధినేత గన్ని భాస్కరరావు, షోరూం అధినేత రాధాకృష్ణ, సీఈవో శ్రీరాం పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి క్లాప్ పథకంలో పనిచేస్తున్న వాహన డ్రైవర్లకు మూడు నెలల నుంచి జీతాలు చెల్లించడంలేదని, తక్షణమే వీరికి జీతాల బకాయిలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

1/70 చట్టాన్ని సవరించాలనే వ్యాఖ్యలకు నిరసన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు జీవనాధారమైన 1/70 చట్టాన్ని సవరించాలని ఏపి శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకుడు పల్లా వెంకట నాయుడు అన్నారు.రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేశారు. 1/70 చట్టం జోలికి రావొద్దన్నారు.

కరాటేలో క్రీడాకారుల ప్రతిభ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన విక్టరీ షోటోఖాన్ కరాటే నేషనల్స్‌లో రాజమహేంద్రవరానికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. నేషనల్స్ కరాటే పోటీలలో బొమ్మూరు శ్రీచైతన్య టెక్నోస్కూల్ ,రాజమండ్రి ఎస్‌కేఆర్ ఉమెన్స్ కాలేజీ క్రీడాకారులు కటాప్ స్పరింగ్ విభాగంలో 12 ఏళ్ళు, 19 ఏళ్లలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు.

మాజీ సీఎం సంజీవయ్యకు గౌరవంపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు గౌరవాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎస్సీఎస్టీ నేతలు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ధారా యేసురత్నం, చాపల చిన్నరాజు అన్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

వార్డుల్లో సమస్యలను గుర్తించాలి

» మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి » కమిషనర్ కేతన్ గార్గ్



గాదాలమ్మనగర్ పుంత రోడ్డు ప్లాన్ పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో నియమితులైన ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే డివిజన్లలో పర్యటించి సమస్యలు గుర్తించిన ప్రత్యేక అధికారులు వాటిపై నివేదిక తయారు చేయాలన్నారు. అలాగే చిన్న చిన్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. సచివాలయ కార్యదర్శులతో కలిసి తిరిగి సమస్యలను గుర్తించాలని వాటి పరిష్కారానికి సమావేశం నిర్వహిచాలన్నారు. చెత్తను పూర్తిగా డంపింగ్ యార్డ్‌కు తరలించే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. షాపుల ఎదుట ప్లాస్టిక్ చెత్త కుండీలు ఏర్పాటు చేసుకోని వ్యాపారస్తులకు జరిమానా విధించాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. పన్నుల వసూళ్ల పర్యవేక్షించాలని, మొండి బకాయిదారులకు సేవలు నిలుపుదల చేయించాలని, నగరంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల యజమానులకు జరిమానా విధించాలని సూచించారు. ప్రతీ వార్డులో సమస్యలపై సమగ్ర వివరాలు సేకరించి ప్రొఫైల్ తయారు చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు నిర్వహించే సమావేశానికి సచివాలయ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కమిషనర్ ఆదేశించారు.

గాదాలమ్మనగర్ పుంత రోడ్డు విస్తరణ

కార్పొరేషన్ పరిధిలోని గాదాలమ్మనగర్ పుంత రోడ్డును 60నుంచి 80 అడుగులకు విస్తరిస్తున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం గాదాలమ్మనగర్ పుంత రోడ్డును టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రోడ్డులో 760 మీటర్ల మేరకు అభివృద్ధి ప్రణాళిక రూపొందించామన్నారు. మొత్తం ప్రభావిత భవనాలు, స్థలాలు 54 ఉన్నాయని, ఈ రోడ్డుకు హైవే నుంచి మునిసిపల్ పరిమితి వరకు మొత్తం 1.2 కిమీ పొడవు ఉంటుందన్నారు. ఈ రోడ్డుకు సంబంధించి స్థలాలు భవనాలు యజమానులతో సమావేశం నిర్వహించి టీడీఆర్ అందజేస్తామన్నారు. ఖాళీ స్థలాల్లో రోడ్డు విస్తరణ చేపట్టి భవన నిర్మిత స్థలాలకు పన్ను విధించనున్నట్టు తెలిపారు. శనివారంలోపు అన్ని భవన యజమానులు నుంచి అవసరమైన పత్రాలు సేకరించి రోడ్డు, అభివృద్ధి ప్రణాళికను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ కోటయ్య, డీసీపీ సత్యనారాయణ రాజు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి, రెడ్‌క్రాస్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రసూనాంబ, డీఎం షేక్ షబ్నం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోకవరం, నిడదవోలు డిపోల సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాతలకు ఆర్టీసీ అధికారులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి

ప్రభుత్వాసుపత్రి ఎదుట కాంగ్రెస్ నిరసన.. అవినీతిపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేదలకు అవినీతిలేని నాణ్యమైన వైద్యసేవలందించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. రాజమహేంద్రవరం పెద్దాసుపత్రిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభను కలిసి ఆసుపత్రిలో జరుగుతున్న అవినీతి, వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి మార్చురీలోని డెడ్‌బాడీని కుటుంబ సభ్యులకు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అంబులెన్స్ యజమానులు రింగ్‌గా ఏర్పడి దోపిడీ చేస్తున్నారన్నారు. వీల్‌ఛైర్‌లో పేషెంట్‌ను తరలించడానికి సిబ్బంది రూ.200లు డిమాండ్ చేస్తున్నారన్నారు. రోగులకు మందులు సక్రమంగా ఇవ్వడంలేదని, డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే ఎంఆర్ఐ తదితర సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా షరీఫ్, పట్నాల శ్రీనివాస్, మోతా శారద తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో 3,4ఉద్యోగుల నియామకాలు చేపట్టాలి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్నం లంచ్ విరామ సమయంలో దేశ వ్యాప్తంగా క్లాస్ 3, 4 ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించినట్టు ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. 2020లో భర్తీ కాకుండా ఖాళీగా ఉన్న క్లాస్ 3,4వ తరగతి ఉద్యోగులు 2700 మంది నియామకాలు చేపట్టాలని, 80శాతం పైగా సభ్యత్వం ఉన్న ఆఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని నిరసన చేసినట్టు తెలిపారు. ఎల్ఐసీలో విరమణల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల ఉద్యోగుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతుందని, వ్యాపార పరంగా ఏటా ప్రగతి చూపిస్తున్నందు వల్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

నిలిచిపోయిన మర్రిపూడి హైస్కూల్ గదుల నిర్మాణం



నిర్మాణంలో ఆగిపోయిన హైస్కూల్ గదులు

రంగంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మర్రిపూడిలోని పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ పాఠశాల నూతన భవనాల నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. నిర్మాణానికి అవసరమైన నిధులు, సామగ్రి ఉన్నా ఏడాది కాలంగా నిర్మాణం ముందుకు సాగకపోవడం వల్ల భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2023లో నాడు-నేడు పథకం కింద ఈపాఠశాలకు ఐదు గదులు మంజూరయ్యాయి. ఇందుకోసం రూ.60లక్షలు నిధులు మంజూరు చేశారు. నిర్మాణం జాప్యం కారణంగా ఐదు గదులకు మూడు గదులు మాత్రమే నిర్మించారు. ఆ గదులు కూడా పూర్తి స్థాయిలో నిర్మించలేదు. గదుల పైన, కింద ఫ్లోరింగ్, గోడకు ప్లాస్టింగ్ చేయకపోవడం వల్ల భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది. పాఠశాల ఖాతాలో రూ.ఏడు లక్షల నిధులు నిల్వ ఉన్నాయి. ఇంకా ఇసుక, చిన్న కంకర ఫ్లోరింగ్ స్లాబ్స్ కూడా నిల్వ ఉన్నాయి. అయినా విద్యాశాఖ సమగ్రశిక్ష అభియాన్, మండల ఇంజనీరింగ్ శాఖల మధ్య సమన్వయం లేక నిర్మాణం మధ్యలో ఆగిపోయింది.

ఈఏడాది ఏప్రిల్ 25లోగా పాఠశాల భవన నిర్మాణం పూర్తి కాకపోతే నిధులు మురిగిపోతాయని, వెంటనే నిర్మాణాలు పూర్తిచేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి కోరుతున్నారు.

పాఠశాలల గదుల నిర్మాణ పనులకు సిమెంట్ సరఫరా చేయక పోవడంతో మర్రిపూడిలో ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ పనులు ఆగిపోయాయని పి.మధుసూదనరావు తెలిపారు. ప్రభుత్వం సిమెంటు సరఫరా చేసినా లేదా సిమెంట్ కొనుగోలు చేసుకోమని ఆదేశాలు ఇచ్చినా నిర్మాణ పనులు వెంటనే చేపడతామన్నారు.

హైస్కూల్ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

మర్రిపూడిలోని శ్రీపుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ జాప్యంపై పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి వివరించారు. సమస్య ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని సమగ్రశిక్ష అభియాన్ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మోదుకూరి సత్తిరాజు, పీటీ చౌదరి, కోట నారాయణరావు, పుట్టా వీరభద్రరావు, పాతూరి భాస్కరరావు, టీడీపీ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా భూమిగల ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తామని మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామిఖాసిం తెలిపారు. కొత్తతుంగపాడులో మంగళవారం జరిగిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆయన మట్లాడారు. ఈగుర్తింపు సంఖ్య కేటాయించడం వల్ల వ్యవసాయ సేవలు సులభ తరమవుతాయన్నారు. రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత భూమిగల ప్రతీ రైతుకు ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తామన్నారు. దీనిద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర సబ్సిడీలు వంటి సేవలు రైతులు పొందవచ్చునని తెలిపారు. భూమిగల ప్రతీ రైతు ఆధార్‌నంబరు, ఆ నెంబరుతో అనుసంధానమైన ఫోన్ నెంబరు, పట్టాదారుపాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని ఖాసిం తెలిపారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

గోకవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈనెల 13నుంచి 19వరకు గోకవరంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సీఎండీ లేఅవుట్ ప్రాంగణంలో పోటీలు నిర్వహించేదుకు ఏర్పాట్లుజరుగుతున్నాయి. జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలో 50 టీమ్‌లు ఇప్పటివరకు పోటీలో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిర్వహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు నాల్గవబహుమతిరూ.10వేలు ఇస్తామన్నారు.

నేటి నుంచి త్రిమూర్తులు స్వామి తీర్థ మహోత్సవాలు



త్రిమూర్తులు స్వామివారి ఆలయం

రాజానగరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం గ్రామ శివారులో పచ్చని పంట పొలాల నడుమ స్వయంభూ రూపంలో కొలువుతీరిన శ్రీత్రిమూర్తులు స్వామి వారి 78వ తీర్థ మహోత్సవాలను ఈనెల12 నుంచి ఐదు రోజులు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం 10.09గంటలకు ఆశ్లేష నక్షత్రయుక్త మేషలగ్నంలో త్రిమూర్తులు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువుగా నిర్వహించనున్నారు. అలాగే తీర్థమహోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో విందు భోజనాలను తలపించే రీతిలో అన్న సమారాధన జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని ఆలయ కమిటీ కోరారు.

వర్గపోరులో స్వామివారు: 78వ కల్యాణోత్సవాలు జరుపుకుంటున్న త్రిమూర్తుల స్వామివారితో పాటుగా భక్తులు ఐదారేళ్లుగా స్థానిక వర్గపోరుతో నలిగిపోతు న్నారు. ప్రతి ఏడాది తీర్థం సమయానికి నెల కొన్న వివాదాల కారణంగా వర్గపోరు తారా స్థాయికి చేరుకుంది.

దివ్యాంగుల వివరాల సేకరణకు టీమ్ సర్వే



భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్న టీమ్ సభ్యులు

రంగంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వివరాలు, బాల్య వివాహాలు సర్వే గురించి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి న్యాయ శాఖ, అంగన్‌వాడీ వర్కర్స్ మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆశావర్కర్లు, ఏఎన్ఎమ్‌లు, వైద్యాధికారులతో సహా 14మంది సభ్యులతో కూడిన ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈటీమ్ సభ్యులు మంగళవారం రంగంపేటలో ఇంటింటికి తిరిగి దివ్యాంగుల వివరాలు, బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు గురించి సర్వే చేశారని పెద్దాపురం న్యాయవాది మడికి రాంబాబు తెలిపారు. ఈసర్వేలో దివ్యాంగుల యోగక్షేమాలు, వైద్యం, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని, సదరన్ సర్టిఫికెట్స్ వచ్చాయా లేదా అని, బాల్య వివాహాలు జరగకుండా ఉండేలా, వాటి వల్ల కలిగే అనర్థాలు గురించి ఇంటింటికి తిరిగి తెలియజేస్తూ అలాగే వాటి వల్ల వచ్చే శిక్షలు గురించి వివరించామని న్యాయవాది రాంబాబు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు బి.వేణుశ్రీలక్ష్మీ, చిన్నారావు, సంకీర్తన, న్యాయవాదులు రాంబాబు, అప్పలకొండ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజలి, బేగం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సూర్యనారాయణుడి కల్యాణం

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకృతి రవణాబ్రహ్మ శివాలయ క్షేత్రంలో సూర్యనారాయణుడి కల్యాణం నిర్వహించారు. మంగళవారం శివునికి పంచద్రవ్యాలు, గోదావరి జలాలతో అభిషేకాలు నిర్వహించారు.

పేరాబత్తుల విజయానికి కృషి చేయండి

రుడా చైర్మన్ బొడ్డు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి విజ్ఞప్తి చేశారు. దివాన్‌చెరువులోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం పేరాబత్తులకు మద్దతుగా గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు కొత్తపల్లి ఆశిష్‌లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంక మల్లిబాబు, దాసరిశ్రీను, గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, ఖండవిల్లి లక్ష్మీ, నూనె వెంకన్న, బచ్చు ప్రసాద్, ముత్యం రాజబాబు, సంగులశ్రీను పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

రంగంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు.మంగళవారం రంగంపేట, చంద్రేడు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు చింతల రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామవరంలో ప్రచారం

అనపర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం రామవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ అబ్జర్వర్ చింతల రామకృష్ణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకర రెడ్డి, జుత్తుగ సూర్యకుమారి కృష్ణ, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖరానికి ఓటు వేయాలి

బిక్కవోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం ఆయన కొమరిపాలెం గ్రామంలోని మురళీమోహనా రైసుమిల్లులో పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడారు. ఎన్నికల పరిశీలకులు చింతల రామకృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ గౌరవ అధ్యక్షుడు పడాల రాము, కూటమి నేతలు కర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ.. రైతుల్లో ఆందోళన



అనపర్తిలో కోళ్ల ఫారం

అనపర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ తూర్పుగోదావరి జిల్లా కోళ్ల రైతుల్లో ఆందోళన నింపుతుంది. అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, కాపవరం, దుప్పలపూడి, ముక్కినాడ, మండపేట, కుతుకులూరు, ద్వారపూడి పరిసరాల్లో పౌల్ట్రీ పరిశ్రమ వ్యాపించి ఉంది.ఒక్కో పౌల్ట్రీలో లక్ష నుంచి రెండు లక్షల వరకు కోళ్లను పెంచుతున్నారు. అనునిత్యం కోళ్లకు వ్యాక్సిన్ అందిస్తున్నారు. దీంతో అంటువ్యాధులు సోకే ప్రమాదం తక్కువ స్థాయిలో ఉంటుందని చెప్పవచ్చు.పశ్చిమ గోదావరి జిల్లాలో చిన్న ఫారాలు అధికంగా ఉన్నాయి. చిన్న ఫారాల రైతులు సరిగా జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కోళ్ల మృత్యువాత పడ్డాయి. నెల రోజులుగా తూర్పుగోదావరి జిల్లాలోని రైతులు మరింత జాగ్రత్త పడుతూ వస్తున్నారు. కోళ్లకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో ఇక్కడ పెద్దగా నష్టం వాటిల్లే పరిస్థితి లేదనే చెప్పవచ్చు.

గుడ్లు ఎగుమతులపై ప్రభావం

బర్డ్‌ఫ్లూ ప్రభావం గుడ్లు ఎగుమతులపై పడే ప్రమాదం ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం ఎగుమతులు జరిగినప్పటికీ మంగళవారం కొంత మేర ప్యాకింగ్స్ తగ్గిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. .

బర్డ్‌ఫ్లూ ప్రభావం చూపకపోవచ్చు..

టి.రామచంద్రారెడ్డి పశువైద్యుడు, అనపర్తి

బర్డ్‌ఫ్లూ ప్రభావం తూర్పుగోదావరి జిల్లాపై పెద్ద ప్రభావం చూపకపోవచ్చు. తూర్పుగోదావరిలో కోళ్ల రైతులు ఎప్పటికప్పుడు కోళ్లకు అవసరమైన వ్యాక్సినేషన్ చేయించడమే కాకుండా కోళ్లకు అందించే మేత విషయంలో కూడా రాజీ పడరు. దీనివల్ల పెద్దగా ప్రభావం ఉండదు. అనపర్తి పరిసరాల్లో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఎక్కడా కనిపించడం లేదు. చికెన్, గుడ్లు తినడంపై ఆందోళన అవసరం లేదు.

ఘనంగా 4వ రోజు అధ్యయనోత్సవాలు



నరసింహస్వామికి తీర్థ బిందె తీసుకెళుతున్నదృశ్యం

కోరుకొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీలక్ష్మినరసింహస్వామి వారి స్వయం భుగా వెలిసిన కోరుకొండ కొండపైన 4వరోజు మంగళవారం అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశక అర్చక స్వాములు, దేవుని కోనేటి నుంచి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల మధ్య తీర్థ బిందె తీసుకుని కొండ పైకి వెళ్లారు. ఆలయ అనువంశక అర్చక స్వాములు వాడపల్లి నాగు ఆచార్యులు, పెదపాటి గిరిధరాచార్యులు, దేవుని కోనేటిలోని తీర్థాన్ని లక్ష్మినరసింహస్వామి వారి అభిషేకం కోసం కొండపైకి తీసుకెళ్లారు. అనంతరం కొండపైన నాల్గవ రోజు అధ్యాపకస్వాములు తిరుపల్నాడు పారాయణం చేశారు.

అశ్వ వాహనంపై పద్మనాభుడి గ్రామోత్సవం

శ్రీ లక్ష్మినరసింహస్వామి వారి దివ్య అధ్యయన మహోత్సవాల్లో భాగంగా నాల్గలవ రోజు మంగళవారం రాత్రి శ్రీభూసమేత అనంతపద్మనాభ స్వామి వారు అశ్వ వాహనంపై ఆసీనులై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అనువంశక ధర్మకర్త, దేవస్థానంచైర్మన్ పరాసర రంగరాజ భట్టర్ స్వామి, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

బిక్కవోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రతి నెలా మూడో శనివారం మధ్యాహ్నం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం వెబెక్స్ మీటింగ్‌లో తెలిపారని ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావుతెలిపారు. మూడో శనివారం ఉదయం 11.45 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్నభోజనం సరఫరా చేసి తర్వాత వారిని ఇంటికి పంపి, మధ్యాహ్నం ఒంటి గంటకు కాంప్లెక్స్ సమావేశానికి అందరూ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. సాయంత్రం 5గంటల వరకూ సమావేశాలు జరుగుతాయన్నారు. బిక్కవోలు, బలభద్రపురం, కొంకుదురు కాంప్లెక్స్‌ల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

విత్తనాల షాపులో తనిఖీలు

కోరుకొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాపవరంలో దేవీ ఏజెన్సీ విత్తనాల షాపులో వ్యవసాయాధికారి తనిఖీ చేశారు. ఫిర్యాదు చేసిన విత్తనాలకు సంబంధించిన రైతుల జాబితాను తీసుకున్నట్టు ఏడీఏ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి, వారి బృందం, ఏరువాక నుంచి వచ్చిన శాస్త్రవేత్తలతో కలిసి ఆర్ఎన్ఆర్ 15048 పంట పొలాలను మరోసారి పరిశీలించారు. రైతులు ఫిర్యాదు చేసిన విత్తనాలకు సంబంధించిన కంపెనీ మేనేజర్‌తో జిల్లా వ్యవసాయాధికారి ఫోన్‌లో సంప్రదించారు. ఈనెల14వ తేదీ శుక్రవారం రైతులు ఫిర్యాదు చేసిన విత్తనాలకు సంబంధించి రైతులతో చర్చించి పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు,శాస్త్రవేత్తలు ఎ.శ్రీనివాస్,ఏడీఏ శ్రీరామలక్ష్మి, ఏడీఏ మల్లికార్జునరావు, రైతులు మై రెడ్డి సూరిబాబు, పంచాది వీర వెంకట సత్యనారాయణ, మణికంఠ, సర్వేశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 12 ఫిబ్రవరి 2025 | 5

వండిన చికెన్ మాత్రమే తినాలి

చికెన్ తింటే.. 75 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకూ వండినది మాత్రమే తీసుకోవాలి. పచ్చిమాంసం తినకూడదు. హాఫ్ బాయిల్డ్ గుడ్లు తినకూడదు. కోడ్లు, మాంసం చేతితో తాకిన తర్వాత శుభ్రంగా కడుక్కోవాలి. గుడ్లు, చికెన్ వేర్వేరుగా ఉంచాలి. ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు. ముడి చికెన్, కోడిగుడ్లు తాకిన ఉపకరణాలను బాగా శుభ్రం చేయాలి. కోళ్లు మరణించి ఉంటే వాటిని జాగ్రత్తగా నిర్మూలన చేయాలి. రవాణా చేసే డబ్బాలు తరచూ శుభ్రం చేయాలి. తూర్పు గోదావరి జిల్లాలో ఎవరికైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లనొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి చెప్పాలి.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో, తూర్పుగోదావరి



కానూరులో డీఎంహెచ్‌వో పరిశీలన

కోడికి.. కష్టమొచ్చింది!

బర్డ్ ఫ్లూ వైరస్.. భయం..భయం



కోడికి కష్టమొచ్చింది.. వైరస్ దెబ్బకు ఓడిపోయింది.. కోడిని చూస్తేనే జనం పరుగుపెడుతున్నారు.. రెండు రోజుల కిందట వరకూ కోడిని చూసి లొట్టలేసిన వారు.. ప్రస్తుతం చికెన్ తినాలా! వద్దా!.. అనే మీమాంసలో పడిపోయారు.. ఎందుకంటే బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. తినకపోవడమే మంచిదనే అభిప్రాయంలో జనం ఉన్నారు.. దీంతో మంగళవారం చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.. పౌల్ట్రీ రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.. ఉభయగోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ యజమానులు లబోదిబోమంటున్నారు.. అయితే యానిమల్ హజ్బెండరీ అధికారులు మాత్రం ఉడకబెట్టిన తరువాత చికెన్ తిన్నా ఇబ్బందేంలేదని చెబుతున్నారు.. గతంలోనూ ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వచ్చింది.. అప్పుడు ఎవరికైనా సోకిందా అని ప్రశ్నిస్తున్నారు.. దీంతో పచ్చిమాంసం తింటే ప్రమాదమే కానీ.. ఉడకబెట్టిన తరువాత తింటే ప్రమాదమేం లేదనేది చాలామంది వాదన..

- మూడు జిల్లాలపై తీవ్ర ప్రభావం
- పడిపోయిన అమ్మకాలు
- ఒక్కసారిగా దిగజారిన గుడ్డు ధర
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ రైతులు
- అప్రమత్తమైన అధికారులు
- ఎక్కడికక్కడ కట్టడికి చర్యలు
- కాకినాడలో ర్యాపిడ్ టీమ్‌లు
- పచ్చి మాంసం తింటేనే ప్రమాదం
- ఆఫ్ బాయిల్డ్ ఎగ్ తినకూడదు
- ఉడకబెడితే తినొచ్చంటున్న వైద్యులు

తూర్పున అప్రమత్తం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కానూరు అగ్రహారంలో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేశారు. వాస్తవానికి జనవరి నుంచే ఇక్కడ కోళ్లు చనిపోతున్నట్టు చెబుతున్నారు. సుమారు 54 వేల కోళ్లు మృతిచెందిన తర్వాత పౌల్ట్రీ యజమాని జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు శాంపిల్స్ తీసి పరీక్షించడంతో బర్డ్‌ఫ్లూ బయటపడింది. ఇప్పటి వరకూ మొత్తం 84 వేల కోళ్లు ఇక్కడ మృతి చెందినట్టు ఓ అధికారి తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది మిగిలిన 2,976 కోళ్లకు మత్తు ఇచ్చి గోతుల్లో పూడ్చేశారు. గ్రామ ప్రజలు పెంచుకుంటున్న సుమారు 45 కోళ్లను కూడా స్వాధీనం చేసుకుని, వాటిని కూడా పూడ్చిపెట్టారు. ఈ గ్రామంలో 2700 మంది జనాభా ఉన్నారు. మూడు ప్రధాన కోళ్ల ఫారాలతోపాటు మరో ఆరు వరకూ ఫారాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం పూర్తిగా ఇక్కడ దృష్టి కేంద్రీకరించింది. వైద్యశాఖ అధికారులు ప్రతి మనిషి నుంచి శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. ఊరిలో ఎవరూ కోడి మాంసం, గుడ్లు తినవద్దని టాంటాం వేసినట్టు సర్పంచ్ దాసం వెంకన్న తెలిపారు. కిలో మీటరు లోపు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఇక్కడ అందరూ అప్రమత్తంగా ఉండేటట్టు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ కోళ్లఫారాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి వైరస్ లక్షణాలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు.



34 గ్రామాల్లో సర్వే : కలెక్టర్

నిడదవోలు నియోజకవర్గం పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల పరిధిలోని 34 గ్రామాల్లో ఇంటింటికీ సర్వే చేసి బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాల ఎవరికైనా ఉన్నాయేమో అనే సర్వే చేయడం కోసం 64 వైద్య బృందాలను నియమించాం. సీతానగరం మండలంలో కూడా సర్వే చేయిన్నాం. ఇతర యానిమల్స్‌కు వైరస్ సోకకుండా వాక్సినేషన్ చేయిస్తున్నాం. అపోహలు వద్దు, జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని, ఇంతవరకూ జిల్లాలో మనుషులెవరికి ఈ వ్యాధి సోకినట్టు దాఖలాలు లేవు. కానూరు నుంచి కోళ్లు, గుడ్లు బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ కానూరులో పర్యటించారు.

కోనసీమలో వైరస్ లేదు!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ ప్రచారంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా పరిధిలో ఎక్కడా బర్డ్ ఫ్లూ ప్రభావం లేనప్పటికీ ప్రచార ప్రభావంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దాంతో కోళ్ల ఆధారంగా నడిచే నాన్‌వెజ్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్ వినియోగం తగ్గుముఖం పట్టింది. చికెన్ దుకాణాలపై ఈ ప్రభావం పడి అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లావ్యాప్తంగా మండపేట, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల పరిధితోపాటు వివిధ ప్రాంతాల్లో 57 లక్షలకుపైగా కోళ్ల పెంపకం జరుగుతున్నట్టు పశు సంవర్ధకశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ ఇవ్వకపోవడం వల్లే కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కోనసీమ జిల్లాలో కోళ్లకు వ్యాక్సినేషన్ చేయడం వల్ల ఆ తరహా వ్యాధిలేమీ సోకలేదనేది అధికారుల వాదన. ఒక కోడికి వేసే వ్యాక్సిన్ ఖర్చు రూ.2 నుంచి రూ.10 అవుతుంది. దీంతో కొందరు వ్యాక్సినేషన్ వేయకపోవడంతో ఈ తరహా వైరస్ సోకుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌల్ట్రీ సంఘ యజమానులు మాత్రం కోనసీమ జిల్లాలో ఎక్కడా వైరస్ లక్షణాలు లేవని.. చికెన్ వినియోగించవచ్చని ప్రచారం చేస్తున్నారు.

కోనసీమలో ఆనవాళ్లు లేవు : కలెక్టర్

కోనసీమ జిల్లాలోని 18 పౌల్ట్రీల్లో 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయి.. ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లను గుర్తించలేదు.. పక్క జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్న దృష్ట్యా పౌల్ట్రీ యజమానులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. వారం రోజులపాటు జిల్లాలో అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరా నిలిపివేయాలి. అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో బర్డ్ ఫ్లూపై సమీక్షించి పలు సూచనలు చేశారు.



బడులు.. సెంట్రల్ జైలులో గుడ్డు నిలుపుదల

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ తీవ్రత వల్ల జిల్లాలోని అన్ని స్కూల్స్‌లో గుడ్లు పంపిణీ నిలిపివేశామని డీఈవో వాసుదేవరావు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. తమ డీజీ ఆదేశాల మేరకు సెంట్రల్ జైలులోని ఖైదీలకు చికెన్, గుడ్డుతో భోజనం ఆపేశామని కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ ఎంఆర్ రవికిరణ్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల వరకూ వాటి బదులుగా మెనూ ప్రకారం శాఖాహార భోజనం అందిస్తామన్నారు. బర్డ్ ఫ్లూపై తాము అప్రమత్తంగా ఉన్నామన్నారు. జైలులో ఖైదీలకు ఆదివారం ఒక్కో ఖైదీకి 175 గ్రాముల చికెన్.. మొత్తంగా ఆదివారం సుమారు 280 కిలోల చికెన్ వినియోగిస్తారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో అధికారుల ఆదేశాలు వచ్చే వరకూ నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

ఎస్సీ హాస్టళ్లలో మటన్ పెట్టండి!

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :బర్డ్ ఫ్లూ కేసులు నమోదు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్సీ హాస్టళ్లలో చికెన్, గుడ్లు సరఫరా నిలుపుదల చేయాల్సిందిగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్ల వార్డెన్లతో ఆమె సమావేశమై పరిస్థితులపై చర్చించారు. జిల్లాలోని ప్రి మెట్రిక్ హాస్టళ్లల్లో ప్రస్తుత మెనూ ప్రకారం అమల్లో ఉన్న వారానికి మూడు రోజులు చికెన్, ఆరు రోజులు కోడిగుడ్లు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో రెండు రోజులు చికెన్, ఆరు రోజులు కోడిగుడ్లు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వెల్లడించారు. చికెన్, గుడ్లకు బదులుగా ఉదయం అల్పాహారంలో పాలు, బూస్ట్, ఆదివారం మటన్ కర్రీ పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా హాస్టల్స్ వార్డెన్లకు సూచించారు.

2900 కోళ్లను పూడ్చేశారు!

పెరవలి మండలం కానూరు అగ్రహారంలో అధికారులు పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు.రెడ్ జోన్‌లో భాగంగా మంగళవారం మాస్కులు ధరించి బ్లీచింగ్ చల్లించారు. ఇదిలా ఉండగా కానూరులోని కోళ్లఫారాల్లో మిగిలిన 2900 కోళ్లను స్పెషల్ టీమ్స్ గోతులు తీసి పూడ్చివేయించారు.కోళ్ల ఫారం వద్ద ఉన్న 350 గుడ్లను కూడా గోతులు తీసి పాతిపెట్టారు.డీపీవో శాంతమ జీ ఆధ్వర్యంలో గ్రామంలో రెడ్‌జోన్‌లో చేపట్టిన వివిధ శానిటేషన్ చర్యలు పర్యవేక్షించారు.పౌల్ట్రీ ఏరియాలో సోడియం క్లోరైడ్‌తో క్లీన్ చేసే పనులు నిర్వహించారు. గ్రామంలో 2700 హౌస్‌హోల్డ్స్ ఉండగా వాటన్నింటిని 3 బృందాలు సర్వే చేశాయి.



కానూరులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

కాకినాడలో అలెర్ట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూతో కోళ్ల మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాల్లో తనిఖీలు చేయాలని సిబ్బందిని ఆదేశించింది. ఈ మేరకు ప్రతి మండలానికి రెండు చొప్పున ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో ఆయా సచివాలయాల్లో పనిచేసే పశుసంవర్ధక శాఖ సిబ్బందిని భాగస్వామ్యం చేసింది. ఈ బృందాలు మంగళవారం నుంచి గ్రామాల్లో కోళ్లఫారాలను తనిఖీ చేయించింది. ఎక్కడైనా కోళ్ల మృత్యువాత పడినట్టు గుర్తిస్తే తక్షణం ఆ ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో మంగళవారం మొత్తం 42 బృందాలు కోళ్లఫారాలను పరిశీలించాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 82 కోళ్ల ఫారాల్లో 62 లక్షల లేయర్, బాయిలర్ కోళ్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ సంఖ్యలో కోళ్లు మృతి చెందినట్టు గుర్తిస్తే ఆయా ఫారాల యాజమాన్యాలు తక్షణం సమాచారం ఇవ్వాలని జిల్లా పశు సంవర్ధకశాఖ ఆదేశించింది. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతుండడంతో ఎక్కడికక్కడ ప్రజల్లో అవగాహన వచ్చేలా చైతన్యం చేయాలని అధికారులు ఆదేశించారు.

కాకినాడ జిల్లాలో అంగన్‌వాడీల గుడ్డుకు ఓకే



కాకినాడ జిల్లాలో స్త్రీశిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న గుడ్లను చిన్నారులకు తినిపించవచ్చా లేదా అనే దానిపై ఆ శాఖ అధికారులు మంగళవారం విషయాన్ని పశుసంవర్ధకశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉడికించిన గుడ్లను తినడం వల్ల ఎలాంటి వైరస్ ముప్పు ఉండదని స్పష్టం చేయడంతో ఈ జిల్లాలో అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా యథాతథం చేశారు. బర్డ్‌ఫ్లూ ఆందోళనల నేపథ్యంలో మంగళవారం గుడ్డు ధర పతనమైంది.

గుడ్డు.. బ్యాడ్

బర్డ్‌ఫ్లూ ప్రభావం కోళ్ల పెంపకందార్లను కొంత దెబ్బకొట్టింది. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రభావం నుంచి బయటపడతామని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు. గుడ్ల పరిశ్రమకు సంబంధించి ఒక్కొక్క గుడ్డు రైతు ధర సోమవారం రూ.4.25 వరకు ఉండగా మంగళవారం రూ.3.95కి తగ్గించి ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఒకేరోజు 30 పైసలు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కిలో రూ.200 నుంచి రూ.220 వరకు విక్రయాలు సాగిన బాయిలర్‌కు కోడిమాంసం ఒక్కసారిగా రూ.180కి పడిపోయింది. కొన్నిచోట్ల కొనేవారు లేక చికెన్ దుకాణాలు తెరవలేదు.

ఎండలొచ్చేశాయి.. వైరస్‌తో ఇబ్బంది ఉండదు..

ప్రస్తుతం కొద్దిచోట్ల మాత్రమే బర్డ్‌ఫ్లూ ఉంది. గోదావరి జిల్లాల్లో ఇతర ప్రాంతాలన్నీ బాగానే ఉన్నాయి. చలికాలంలో మాత్రమే వైరస్ ప్రబలి కోళ్లు చనిపోతాయి. ప్రస్తుతం ఎండలు కాస్తున్నాయి కాబట్టి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టమేమీ ఉండదు.

- పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ సెక్రటరీ

ఉడికించిన తరువాత తింటే ఏం కాదు..

బాగా ఉడికించిన తరువాత చికెన్, గుడ్లు తింటే వైరస్ ప్రభావం ఉండదు. ఈ రంగంపై అపోహలు తొలగేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలి. వైరస్ కారణంగా కొన్నిచోట్ల జరిగిన పొరపాట్లకు మొత్తం పరిశ్రమ నష్టపోయే పరిస్థితి సరికాదు. **- మేకా శ్రీనివాస్, పౌల్ట్రీ యజమాని, మండపేట**

ఖైదీలకు హెచ్ఐవీ పరీక్షలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోని ఖైదీలకు హెచ్ఐవీ సెంటినల్ సర్వే ప్లస్ (హెచ్ఎస్ఎస్ ప్లస్) ప్రారంభించామని జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన 400 మంది ఖైదీలకు రోజుకు 20 మందికి మించకుండా రక్త నమూనాలు సేకరిస్తున్నామని చెప్పారు. వాటిని పరీక్షల నిమిత్తం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలోని మైక్రోబయాలజీ విభాగానికి పంపిస్తున్నామన్నారు.ఆ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మార్చి నెలాఖరు వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు.పరీక్షలు వ్యాధుల నివారణకు ఉపకరిస్తాయనితూర్పు, ఏలూరు జిల్లాల క్లస్టర్ మేనేజర్ పి.బాలాజీ వెల్లడించారు.కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌రాజ్‌కుమార్,డాక్టర్ కోమల పాల్గొన్నారు.

కొవ్వూరులో వారానికోసారి రైతు సమస్యల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ స్థాయిలో వారానికి ఒకసారి రైతులకు సంబంధించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జేసి రెవెన్యూ సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా తూర్పుగోదావరి జిల్లాలో జాయింట్ కలెక్టర్ డివిజనల్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయానికి వచ్చి మండల తహశీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న అడంగల్ కరెక్షన్, రెవెన్యూ సమస్యలను పరిష్కరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పొరపాటున పడిన తప్పులను తక్షణం సరిచేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో కొవ్వూరు తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్,ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజానికి కృషి

- జిల్లా కేంద్రంలో డీఈఐసీ సెంటర్
- 24 వరకు ఇంటింటా సర్వే
- పీడీజే గంధం సునీత



డీఈఐసీ సెంటర్ పరిశీలించి చిన్నారిని ముద్దాడుతున్న పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భావి భారత పౌరులు ప్రతి ఒక్కరూ ఎలాంటి లోపాలూ లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత వెల్లడించారు.ఈ మేరకు హైకోర్టు ఆదేశాలతో ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డీఈఐసీ)లను ప్రారంభించడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, డీఎం హెచ్‌వో, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, ఎంఎల్ఎస్ఏ కార్యదర్శులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకూ కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లాలోని డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా దివ్యాంగ పిల్లలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో రిఫర్ అవుతున్న కేసులు, వాటిపై తీసుకుంటున్న చర్యలను కూడా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఒకవేళ వివిధ కారణాల వల్ల దివ్యాంగులను ఇంటి వద్ద ఉంచి వారు పనులకు వెళ్తే అలాంటి పిల్లలను ప్రభుత్వ వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని పీడీజే వివరించారు. జిల్లా కేంద్రాల్లో ఉండే డీఈఐసీ సెంటర్లను ఎప్పటికప్పుడు సందర్శిస్తామని చెప్పారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలోని చిన్నారుల వైద్య సేవల విభాగాన్ని ఆమె పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. వైద్యాధికారులు,సిబ్బందితో సమీక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి (ఇన్చార్జి) ఎస్కే జానీబాషాశ్రీ, శిశు సంక్షేమాధికారి కె.విజయ కుమారి, డీఈఐసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ డి.హరిశ్చంద్ర ప్రసాద్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఇంద్రజ పాల్గొన్నారు.

ఈగిల్..రైట్ రైట్!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత మాదక ద్రవ్యాలను.. ముఖ్యంగా గంజాయిని నిర్మూలనపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన ఎలైట్ యాంటి-నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈఏజీఎల్ఈ -ఈగిల్) విభాగానికి చెందిన జిల్లా టీం, వాహనాన్ని మంగళవారం ఎస్పీ నరసింహ కిశోర్ పచ్చ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

- రాజమహేంద్రవరం



ఈగిల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



దివ్యాంగులతో సదరంగం!

సదరం రీ వెరిఫికేషన్ .. గందరగోళం

- దివ్యాంగులకు తప్పనిపాట్లు
- ఓపీ రోగులకు తీరని అవస్థలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రిలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ గందరగోళంగా సాగుతోంది. మూడు రోజుల విరామం తర్వాత మంగళవారం ఈ ప్రక్రియను అధికారులు మళ్లీ ప్రారంభించారు. ఆసుపత్రి ప్రధాన బ్లాకులోని పై అంతస్తులో ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, సైకియాట్రిక్ విభాగాలకు సంబంధించి రీ వెరిఫికేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. అయితే ఎవరు ఓపీ చూపించుకోవడానికి వచ్చారో, ఎవరు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చారో తెలియని అయోమయ పరిస్థితులు అక్కడ నెలకొంటున్నాయి. ఆయా విభాగాల్లోని సిబ్బంది సైతం సరైన సమాధానం చెప్పకపోవడంతో వైద్య సేవల కోసం వస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. రీ వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు, వారి సహాయకులు కూర్చోడానికి కూడా సరైన ఏర్పాట్లు లేవు. కేవలం కొద్ది మందికి మాత్రమే సరిపడే బల్లలు అక్కడ ఉన్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డాక్టర్ పిలిచే వరకూ గంటల తరబడి నిలబడి ఎదురు చూడాల్సి వస్తోంది. పరిస్థితులు ఇంత గందరగోళంగా మారినా సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌కు సంబంధించి అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఓపీ చూపించుకోవడానికి వచ్చే వారితో పాటు రీ వెరిఫికేషన్ కోసం వస్తున్న వారికి ఇబ్బందులు తప్పడంలేదు. మరోపక్క ఓపీ నమోదు విభాగంలోనూ ఇలాంటి గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

బర్డ్‌ఫ్లూపై అపోహలు వద్దు : కలెక్టర్

▸ కానూరు అగ్రహారంలో కోళ్లఫారాల సందర్శన ▸ పారిశుధ్య పనులు, వైద్య శిబిరాల పరిశీలన ▸ ముందు జాగ్రత్త చర్యలపై అధికారులకు ఆదేశాలు



కానూరు పౌల్ట్రీ వద్ద పరిశీలనకు వెళుతున్న అధికారులు

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్‌పై అపోహలు వద్దని, వైరస్ నిర్ధారణ అయిన వెంటనే తమ సిబ్బంది అప్రమత్తమయ్యారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం ఆమె కానూరు అగ్రహారంలో కోళ్ల మృత్యువాత పడిన ఫారాలను పరిశీలించారు. అక్కడ అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి వారికి కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. కానూరు అగ్రహారం చుట్టుపక్కల 34 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. రోగ చికెన్ షాపుల్లో పనిచేసే కార్మికులకు స్వాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జ్వరాలు ఉన్నదీ లేనిదీ గుర్తించడానికి 64 వైద్య బృందాలతో ఇంటింటా సర్వే చేయిస్తున్నట్టు ఆమె వివరించారు. ఈ వైరస్ ఇతర పశువులకు సోకకుండా ముందుస్తుగా వ్యాక్సినేషన్ చర్యలు చేపట్టినట్టు ఆమె చెప్పారు. కోళ్లఫారాలు వద్ద సీసీ కెమెరాలు ఉన్నదీ లేనిదీ ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. కిలోమీటర్ దూరంలో వైద్య ఆరోగ్యశాఖ బృందం ఇంటింటా వైరస్ లక్షణాలు గుర్తించేందుకు క్యాంపెయిన్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ వ్యాధి మిగిలిన ప్రాంతాలకు సోకకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, ఎటువంటి భయాందోళన చెందవద్దని, అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు, స్థానిక మండల అధికారులు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణ

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు రిసెప్షనిస్టు, ఆఫీసు అసిస్టెంట్ కోర్సులకు ఉచితంగా శిక్షణ అందజేస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. కంప్యూటర్ స్కిల్స్, జాబ్ స్కిల్స్‌లో శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఈ నెల 17 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 17 నుంచి 40 మధ్య వయస్సు ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. కళాశాల స్కిల్ హబ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే ర్యాంపులు రద్దు

ఇసుక లారీలకు టార్పాలిన్ తప్పనిసరిగా కట్టాలి

▸ కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి
▸ ఆరికిరేవులలో ఇసుకర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ఇసుక ర్యాంపులను రద్దు చేస్తామని కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో ఇసుకర్యాంపు ఏర్పాటుపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లారీలకు తప్పనిసరిగా టార్పాలిన్ కట్టాలని, రోడ్లపై ఇసుక జారి పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై పడిన ఇసుకను శుభ్రం చేయవలసిన బాధ్యత నిర్వాహకులదేనన్నారు. ఇసుక తవ్వకాలు, లోడింగ్‌కు అయ్యే చార్జీలు మాత్రమే చెల్లించి ఉచితంగా తీసుకోవచ్చునన్నారు. ర్యాంపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అదనంగా డబ్బులు వసూలుచేసినా, అవకతవకలకు పాల్పడినా ర్యాంపులను రద్దు చేస్తామన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, రాత్రుళ్లు ఇసుక తవ్వకాలకు అనుమతుల్లేవన్నారు. ర్యాంపుల్లో ట్రాక్టర్లను అడ్డుకుంటే తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సర్పంచ్ మట్టా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇసుక లారీలకు టార్పాలిన్ కట్టడం లేదన్నారు. గత ఐదేళ్లలో ఇసుకర్యాంపులు, లారీల కారణంగా గ్రామానికి చెందిన సుమారు 10 మంది మృత్యువాత పడ్డారని, లారీల యజమానులు సమాధానం కూడా చెప్పడం లేదని, గట్టిగా అడిగితే ఇన్సూరెన్సూ క్లైమ్‌లు చేసుకోమంటున్నారని వాపోయారు. ఏటిగట్టు తవ్వి ఇసుకర్యాంపులు ఏర్పాటు చేయడం వల్ల వర్షాకాలంలో ఏటిగట్టు తెగిపడి చాలా గ్రామా లు ప్రమాదం బారిన పడే ప్రమాదముందన్నారు. మాజీ ఉప సర్పంచ్ అల్లు శ్రీను మాట్లాడుతూ ఇసుకర్యాంపులు, లారీ లు రోడ్లపై నిలుపుదల చేయడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్లపై ఇసుక లా రీలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని, స్థానికులకే ర్యాంపుల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలన్నారు. ర్యాంపుల వద్ద ఇసుక లారీలకు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ఇసుక తెచ్చుకోవచ్చునని చెప్తున్నప్పటికీ నిర్వాహకులు ట్రాక్టర్లను ర్యాంపుల్లోకి రానివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎంబీఎస్ శంకరరావు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, గ్రామస్థులు చావా శ్రీనివాస్, యనమదల శివరామకృష్ణ, గుత్తా రమణ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న గ్రామస్థులు

సూర్యనారాయణుడి కల్యాణం

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకృతి రవణాబ్రహ్మ శివాలయ క్షేత్రంలో సూర్యనారాయణుడి కల్యాణం నిర్వహించారు. క్షేత్రంలో జరుగుతున్న మహా సౌరయాగంలో భాగంగా మంగళవారం శివునికి పంచద్రవ్యాలు, గోదావరి జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ దంతులు స్వామికి కల్యాణం జరిపించారు.

కొత్తగా 10 ఓపెన్ ర్యాంపులు

▸ నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్
▸ మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి

ఫిబ్రవరి నెలాఖరు నాటికి జిల్లాలో కొత్తగా 10 ఓపెన్ ర్యాంపులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిచేసి జిల్లా సాండ్ కమిటీ సమావేశంలో చర్చించిన అనంతరం జిల్లాలోని ఆరికిరేవుల, చిడిపి, ప్రక్కిలంక, తాడిపూడి, పురుషోత్తపల్లి, మునికూడలి, పెండ్యాల, కాటవరం, శింగవరం గ్రామాల్లో ఓపెన్ ర్యాంపులకు ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 9 డీసిల్టేషన్ ర్యాంపులు నడుస్తున్నాయని, ఈ రోజు, రేపటిలోగా మిగిలిన 8 డీసిల్టేషన్ ర్యాంపులకు అనుమతులు ఇస్తామన్నారు. అలాగే ఓపెన్ ర్యాంపులు 12 నడుస్తున్నాయన్నారు. వేమగిరి, జీడిగుంట ర్యాంపులను రద్దు చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఇచ్చే 10 ఓపెన్ ర్యాంపులు అందుబాటులోకి వస్తే 57 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలు చేపట్టవచ్చునన్నారు.

విక్రయాలు బంద్

▸ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో కోడి మాంసం విక్రయాలు నిలుపుదల చేసిన అధికారులు



దేవరపల్లిలో కోళ్ల అమ్మకాలను అడ్డుకుంటున్న పంచాయతీ అధికారులు

చాగల్లు/దేవరపల్లి/తాళ్లపూడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పలుచోట్ల కోడి మాంసం విక్రయాలు నిలిచిపోయాయి. ప్రజారోగ్యం దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు కోడి మాంసం విక్రయాలు నిలిపివేయాలంటూ మండల, గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో వ్యాపారులకు తెలియజేస్తున్నారు. విక్రయాలను నిలుపుద చేస్తున్నారు. మండల కేంద్రమైన చాగల్లులో కోడి మాంసం అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేసినట్టు పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ ఆలీ మంగళవారం తెలిపారు. పరిస్థితులు చక్కబడే వరకు ఎవ్వరూ కోడి మాంసం తినవద్దన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి దుకాణ యజమానులు, ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే దేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో కోడిమాంసం అమ్మకాలు నిలుపుదల చేశారు. దేవరపల్లిలో వ్యాన్‌పై కోళ్లను తీసుకొచ్చి షాపులకు వేస్తున్న వారిని పంచాయతీ అధికారులు అడ్డుకుని అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి పంపించివేశారు. 15రోజుల వరకు కోడి మాంసం విక్రయాలు జరపకూడదని షాపుల యజమానులను ఆదేశించారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లలో కోడిమాంసం సంబంధిత వంటకాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులకు తెలిపారు. దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి రవికిషోర్ అన్ని మాంసం దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లకు నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా చికెన్ అమ్మకాలు, కొనుగోలుకు కొద్దిరోజులు దూరంగా ఉండాలని తాళ్లపూడి ఎంపీడీవో టీబీ వెంకటరమణ చెప్పారు. జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి కోళ్ల వినియోగంపై నిషేధాజ్ఞలు జారీ చేసారన్నారు. దీనిపై ప్రజలకు అర్థమయ్యే విధంగా పంచాయతీలలో టాం టాం ద్వారా అవగాహన కలిపిస్తామన్నారు. మండలంలోని కోళ్ల ఫారాలను సందర్శించి చనిపోయిన వాటిని ఖననం చేయించి అమ్మకాలు నిలిపి వేసినట్టు తెలిపారు. ఫారాలతోపాటు చికెన్ షాపులు, హోటళ్లకు ఆదేశాలు జారీ చేశామని ఎంపీడీవో పేర్కొన్నారు.

గోపాలపురంలో విక్రయాలు

గోపాలపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ కలకలంతో జిల్లాలో వైరస్ వ్యాప్తి చెందిందని కోడిమాంసం, గుడ్లు, తినవద్దంటూ జిల్లా అధికారులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. గోపాలపురంలో ఉదయం నుంచి మాంసం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. సాయంత్రం మాత్రం నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉండగా పలు గ్రామాల్లో ఉన్న కోళ్ల ఫారాల్లో వేలాది సంఖ్యలో కోళ్లు మృతి చెందుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే కోళ్ల ఫారాల నిర్వాహకులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జేసీబీ సాయంతో భారీ గోతులు తవ్వి మృతి చెందిన కోళ్లను పూడ్చిపెడుతున్నట్టు సమాచారం.



గోపాలపురంలో అమ్మకానికి ఉంచిన కోడిమాంసం

ఇంటింటా జ్వరాల సర్వే



పాలంగిలో జ్వరాల సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రసాద్

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వచ్చినందున జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఉండ్రాజవరం మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం వైద్యసిబ్బంది డాక్టర్లు ఆర్ఎస్ ప్రసాద్, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేశారు. జ్వరాలు ఉన్నదీ లేనిదీ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎటువంటి జ్వరాలున్నా గ్రామాల్లో తమ సిబ్బందికి తెలియజేయాలని డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. గ్రామాల్లో చికెన్, గుడ్ల షాపుల వారు విక్రయించరాదని పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేశారు. ఎవరైనా చికెన్, గుడ్లు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరికిరేవులలో సినిమా షూటింగ్ సందడి

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సినీ హీరో రామ్ పోతినేని 22వ సినిమా షూటింగ్ కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. మైత్రి మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇంకా పేరు పెట్టలేదు. మంగళవారం ఆరికిరేవుల స్నానఘట్టం, గోదావరి నది వద్ద సన్నివేశాలను చిత్రీకరించారు. రారా కృష్ణయ్య, మిస్టర్ పోలిశెట్టి సినిమాలకు దర్శకుడిగా పనిచేసిన పి.మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ సినిమాలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే, ప్రధానంగా రావు రమేష్, బ్రహ్మనందం, హర్షవర్ధన్‌లు నటిస్తున్నారు. వివేక్ మార్విన్‌లు మ్యూజిక్ అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం బ్యాక్‌డ్రాప్‌గా సాగే చిత్రం కావడంతో మరో నెల రోజుల పాటు కొవ్వూరు పరిసర ప్రాంతాలో చిత్ర నిర్మాణం జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలుపుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు

గోపాలపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చైతన్యరాజు

గోపాలపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లోనూ పేదలకు వైద్యసేవలందిస్తున్నామని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్ర (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ చైతన్యరాజు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. చైతన్యరాజు మాట్లాడుతూ ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, గుండె దడ, ఆయాసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉన్న వారిని గంట వ్యవధిలో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తే టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్ ఉచితంగా అందిస్తారన్నారు. దీని ద్వారా ఒక వ్యక్తిని కాపాడిన వారవుతారని అన్నారు. రూ.45 వేలు విలువైన ఈ ఇంజెక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సత్య, మేరీ, దేవిశ్రీ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి : ఆర్డీవో

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రీసర్వేపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో భూముల రీసర్వే చేస్తున్న అధికారులకు తగిన పత్రాలు అందజేయాలన్నారు. సర్వే సమయంలో అధికారులు జారీచేసే నోటీసులకు సంబంధించి రికార్డులు అందజేసి సహకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే సమయంలో తప్పనిసరిగా ఇరుపార్టీలు హాజరయ్యే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వే ప్రక్రియ ప్రగతిపై సీసీఎల్ఏ కమిషనర్ నేరుగా కలెక్టర్‌లతో సమీక్ష నిర్వహిస్తున్నారని, సిబ్బంది మెరుగైన పనితీరును చూపాలన్నారు.సమావేశంలో సర్వే జిల్లా అధికారి బి.లక్ష్మీనారాయణ, తహశీల్దార్లు, రీసర్వే డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మైనర్ ప్రేమ!

▸ బాలికతో ప్రేమాయణం
▸ తల్లిదండ్రులను ఇంటికి పిలిచి దుర్భాషలాడిన బాలిక బంధువులు
▸ మనస్తాపంతో బాలుడి ఆత్మహత్య



సూర్య మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అవమానించారని మనస్థాపం చెందిన బాలుడు చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన చిట్ర సూర్య రాజమహేంద్రవరంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వాడపల్లికి చెందిన బాలికతో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి, అమ్మమ్మ, మేనమామ, తాతయ్యలు సూర్యను అడిగారు. సూర్య ఇంట్లో విషయం చెప్పడంతో తండ్రి చిట్ర శివ, అతని భార్య బాలిక ఇంటికి వెళ్లారు. దీంతో బాలిక తరుపు వారు, రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది కలిసి దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించారు. తన వల్ల తల్లిదండ్రుల అవమానపడ్డారని మనస్థాపం చెందిన సూర్య సోమవారం అర్ధరాత్రి 1గంట సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా హాలులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు బాలిక కుటుంబ సభ్యులు ఐదుగురిపై పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం, మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరించడం, చేతులతో కొట్టడం, అందరూ కలిసి మూకుమ్మడి దాడి చేయడంపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేశారు.



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు, ఎంపీపీ నారాయుడు

కూటమి అభ్యర్థిని గెలిపించండి

▸ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
▸ పలుచోట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కొవ్వూరు మండలంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని దొమ్మేరు బ్యాంకు ఆఫ్ ఇండియా, కుమారదేవం గురుకుల పాఠశాల, పెనకనమెట్ట, ధర్మవరం, కాపవరం గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 7 నెలల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ మేకల శ్రీను, కేవీకే రంగారావు, కె.విజయలక్ష్మి, కె.సుబ్బారావు, పెరుగుపోతురాజు, సుంకర సత్తిబాబు పాల్గొన్నారు. అనంతరం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

నల్లజర్ల: తెలికిచర్ల గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ధూళి రంగనాయకులు, వీరవల్లి శ్రీనివాసరావు కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కేయూ భాస్కరరావు, షేక్ మీరాసాహెబ్, సుంకర సుబ్బారావు, మద్దిపాటి సుబ్బారావు, గుదే సుబ్బారావు పాల్గొన్నారు.

మార్గదర్శకాలను అమలు చేయాలి : ఆర్డీవో

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మార్గదర్శకాలను సక్రమంగా అమలు చేయాలని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. మంగళవారం పెరవలి మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రంలో 750 నుంచి 1000మంది తమ ఓట్లు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందన్నారు. మండలంలో మూడు పోలింగ్ స్టేషన్లు ఉండగా, పురుషులు ఓటర్లు 1110 మంది, మహిళా ఓటర్లు 817మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్డీవో రాణిసుస్మిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.అచ్యుతకుమారి, అధికారులు పాల్గొన్నారు.



పెరవలిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత

పల్లంట్లలో వృద్ధురాలు అనుమానాస్పద మృతి



మహాలక్ష్మి (ఫైల్)

దేవరపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లంట్ల గ్రామంలో ఓ వృద్ధురాలు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసు లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లం మహాలక్ష్మి(78) భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. వారికి ఇద్దరు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. ఆమె అద్దింటిలో నివాసం ఉంటూ పింఛన్ డబ్బులతో జీవితం గడుపుతోంది. అప్పుడప్పుడు కుమారుల ఇళ్లకు వెళ్తుంది. ఈమెకు మూర్ఛ వ్యాధి ఉంది. సోమవారం రాత్రి గ్రామంలోని చిన్న కుమారుడి ఇంటి వద్ద పడుకోగా 10గంటల సమయంలో మంచం పైనుంచి కింద పడిపోయి కదలిక లేకపోవడంతో మనవరాలు చూసి కుమారుడు బొల్లం వెంకట్రావుకు చెప్పింది. అతడు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ నాగభూషణం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొవ్వూరులో సుందర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు తనకు వేసి గెలిపించాలని జీవీ సుందర్ అన్నారు. మంగళవారం కొవ్వూరులో మాజీ మంత్రి జీవీ హర్షకుమార్ తనయుడు సుందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో యువతను కలిసి ఓట్లు అభ్యర్థించారు. నాణ్యమైన విద్యనందించడం, ఉపాధి, ఉద్యోగ భద్రతకు పోరాడుతానన్నారు. తోటి గ్రాడ్యుయేట్‌గా తన కు మొదటి ప్రాధాన్య ఓటువేసి ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ రవిప్రకాష్, కప్పల రాజేష్, దారం గిరి, ఎస్.పుల్లారావు పాల్గొన్నారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం



నల్లజర్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపల్లికి చెందిన కంచర్ల వెంకన్నకు జనసేన నాయకులు ఆర్థిక సాయం అందించారు. వెంకన్న ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకోవడంతో జనసేన నాయకులు స్పందించి రూ.15 వేలు సమకూర్చారు. మంగళవారం వెంకన్నను పరామర్శించి సదరు సొమ్ములను పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో నాయకులు సూరినేడి కిషోర్, ఆలపాటి అఖిల్, తలారి సౌజన్య, ఉన్నమట్ల సత్యపురెళ్ళ సత్యనారాయణ, ఉన్నమట్ల ఇస్సాకు, జి.వరుణ్ పాల్గొన్నారు.

కార్మికులపై నిఘా

▸ మెయింటెనెన్స్ వర్కర్ల యూనియన్‌పై వేధింపుల పర్వం
▸ కాంట్రాక్టర్ నిర్వాకం తేటతెల్లం

గోపాలపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి మంచినీటి సరఫరా మెయిన్టెనెన్స్ వర్కర్స్ యూనియన్‌పై కాంట్రాక్టర్ నిఘా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని జీతాలు ఇవ్వరు.. వేధింపులు ఆపరు అనే కథనంతో ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. పెండింగులో ఉన్న జీతాలు ఇవ్వమని అడిగిన వర్కర్లకు వేధింపులు తప్పడం లేదనడంలో సందేహం లేదని మంగళవారం మరోసారి రుజువైంది. సోమవారం వర్కర్స్ అంతా కలిసి పత్రికల ముందు తమ గోడు వెల్లబుచ్చుకుంటే వారిని అణచివేయడానికి సత్యసాయి మంచినీటి సరఫరా నిర్వహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పని ప్రదేశంలో కార్మికుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా కాంట్రాక్టరే స్వయంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎలాగైనా వర్కర్స్‌ను తన గొప్పెట్లోకి తెచ్చుకుని అదుపులో పెట్టాలని ఈ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వర్కర్స్ చెబుతున్నారు.



హుకుంపేటలో సత్యసాయి పంపింగ్ స్కీమ్ వద్ద అమర్చిన సీసీ కెమెరా

డిజిటల్ చెల్లింపులపై అప్రమత్తంగా ఉండాలి

నల్లజర్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): డిజిటల్ చెల్లింపులపై ప్రజలు అప్రమత్తంగా ఉండా లని నల్లజర్ల సీఐ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లజర్ల రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌కి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరికీ ఓటీపీలు చెప్పరాదని, అపరిచితులు పంపిన వాట్సాప్ మేసెజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.అంజనేయులు, మేనేజర్ అశోక్‌కుమార్, బ్యాంకుల మేనేజర్లు వెంకట్రావు, రాజు, కె.లక్ష్మీప్రసన్న, హెచ్ఎం కోమల చిత్ర పాల్గొన్నారు.